https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 6 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం, సెప్టెంబర్,30, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు

-కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత-ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు - రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు





హైదరాబాద్,సెప్టెంబర్,29: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు.

సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

30 ఏళ్ల ప్రస్థానంలో...

డీకే పబ్లికేషన్..

సీఎండీ దేవరకొండ కాళిదాస్

హైదరాబాద్,ప్రతినిధి సెప్టెంబర్30,(డీకే చాటింపు):



30ఏళ్ల పాటు పత్రికను నడిపించడం ఓ సాహసం. కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడి నా అణువణువునా నిక్షిప్తమై ఉంది. పత్రికను నిర్వహిం చడమంటే తారు రోడ్డుపై కారులో ప్రయాణం చేయడం ఏమాత్రం కాదని డీకే పబ్లికేషన్ సీఎండీ దేవరకొండ కాళిదాసు అన్నారు. 30 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా అంబర్‌పేట్ లోని కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనమాట్లాడారు. కాళిదాసు మాటల్లోనే...పత్రిక నడపడం అంటే ముమ్మాటికీ కంకరతేలిన గతుకుల రోడ్డుపై ఎడ్లబండిప్రయా ణమే. 1995లో ఉదయం దినపత్రికను మూసేసే నాటికి నేను తెలంగాణ జిల్లాల కోఆర్డినేటర్‌గా పనిచేసే వాడిని. అప్పుడేవార్తదినపత్రిక పురుడుపోసు కుంటోంది. ఆ సమయంలో నా సహ జర్నలిస్టుల్లో అధికులు ఆ పత్రికలో జాయిన్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. సరిగ్గా అప్పుడునాఆత్మీయుడు, స్వర్గీయ ఎన్టీరామారావు మంత్రివర్గంలో ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రిగా పనిచేసిన స్వర్గీయ మల్యాల రాజయ్య నన్ను ఏమాత్రం ఉద్యోగంలో చేరవద్దని వారించారు. 10 మందిని జర్నలిస్టుగా తయారు చేయాలంటే ఒక పత్రికను ప్రారంభించాలని ప్రోత్సహించారు. అప్పటికే చాలా పత్రికలు మార్కెట్లో ఉన్నాయి. మరో పత్రికకు మనుగడఉందా అని ప్రశ్నిస్తే, పెద్ద పత్రికలకు ఆబ్లిగేషన్స్ ఉంటాయి, కొన్ని విభాగాలను టచ్ చేయరు, అలాంటి వాటిని ప్రముఖంగా ప్రచురిస్తే పాఠకుల ఆదరణఉంటుందని సలహా ఇచ్చారు. అయితే, ఎంత పైకి ఎది గినా మన కాళ్లు భూమిపై ఉండేలా చూసుకోవాల నిసూచించారు. ఇప్ప టికీ నేను అదే పాఠిస్తున్నాను. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో 30 ఏళ్ల కిందట, సరిగ్గా ఇదే రోజు సీనియర్ ఎడిటర్, స్వర్గీయ పొత్తూరి వెంకటేశ్వర్ రావు చేతుల మీదుగా, మంత్రి మల్యాల రాజయ్య, ప్రస్తుత అసెంబ్లీ కౌన్సిల్‌లో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్యఅతిథులుగా పత్రిక నిర్వహణా రంగంలోకి ఆరంగేట్రం చేశాను. ఈ జర్నీలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీ రామారావు, ఆనాటి కర్షక పరిషత్ చైర్మన్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , నన్ను దత్తపుత్రుడిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వార్షికోత్సవంలో ప్రకటించిన స్వర్గీయ దాసరి నారాయణ రావు,నా గురువు స్వర్గీయ గజ్జల మల్లారెడ్డి , స్వర్గీయ ఎడిటర్ పతంజలి, పొలిటికల్ కార్టూన్లు వేసి ప్రోత్సహించిన స్వర్గీయ మోహన్ గ, ఆనాటి మఫిసిల్ డెస్క్ ఇంచార్జ్ స్వర్గీయ లక్ష్మణ్ రావు, నాకు టైటిల్ ఇచ్చిన మిత్రుడు స్వర్గీయ బాలగంగాధర్, ప్రస్తుత రాజకీయాల్లో ఆరితేరిన సజ్జల రామకృష్ణారెడ్డి, స్వర్గీయ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, దోమకొండ రాజయ్య తదితరులను ఈ 30 వసంతాల వేళ గుర్తుకు చేసుకోవడం నా బాధ్యత. నేను ఈ స్థాయిలో ఉండడానికి కారణమై ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు, నా వెన్నంటి ఉన్న నా సహ ఉద్యోగులందరికి పేరుపేరునాధన్యవాదములు.

జ్ఞానేష్ కుమార్ ఎందుకు రాజీనామా చెయ్యాలి?: ఈటల



న్యూఢిల్లీ,సెప్టెంబర్,29: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఖండించారు. అసలు జ్ఞానేశ్ కుమార్ ఎందుకు రాజీనామా చేయాలని ఆయన ప్రశ్నించారు. తాజాగా ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో తమ స్వార్థ రాజకీయాల కోసం ఎన్నికల సంఘాన్ని వాడుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఈటల మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. గత 12, 13 ఏళ్లుగా ప్రజా సమస్యలను లేవనెత్తడంలో పూర్తిగా విఫలమైన ప్రతిపక్ష కాంగ్రెస్, ప్రస్తుతం ఓటమి భయం, అసహనంతోనే రాజ్యాంగ వ్యవస్థలపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే భారత దేశం ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా నిలిచిందని, కానీ రాహుల్ గాంధీ విదేశీ వేదికలపై భారత జాతి ఆత్మగౌరవాన్ని దిగజారుస్తూ మాట్లాడటం వల్ల ప్రజలు ఆయనను అసహ్యించుకుంటున్నారని విమర్శించారు.“ఓటర్ల జాబితా సరి చెయ్యాలనే ప్రతిపాదన చేసింది రాహుల్ గాంధీనే. సర్ అనేది కొత్తది కాదు.. అదో నిరంతర ప్రక్రియ. ఎన్నికల సంస్కరణలు జరుగుతూనే ఉన్నాయి. ఈవీఎంలను మొదట తీసుకువచ్చింది కాంగ్రెస్.. 2017లో వీవీప్యాట్‌లను మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చింది. కాంగ్రెస్ గెలిస్తే ఒకపాట, ఓడితే మరో పాట పాడుతుంది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయగలితే 400 సీట్లు దాటే వాళ్ళం కదా..? 2026లో ఏ సర్వే చూసినా మోడీనే మళ్ళీ గెలుస్తాడు అని వస్తుంది. మోడీ వచ్చాకే.. భారత జాతీయ పతాకం విదేశాల్లో గౌరవం పొందుతుంది. సర్‌లో చనిపోయిన వాళ్ళ ఓట్లు రిమూవ్ చేస్తున్నారు. గ్రామాల్లో కొందరికి డబుల్ ఓట్లు ఉన్నాయి. మల్కాజిగిరిలో సగం ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. చాలా మందికి తమ స్వంత గ్రామాల్లో ఓట్లు ఉండటం దీనికి ప్రధాన కారణం” అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు..

మరోసారి విపక్షాల భారీ ప్లాన్..!



న్యూఢిల్లీ,సెప్టెంబర్,29: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలంటూ విపక్షాలు మళ్లీ దూకుడు పెంచుతున్నాయి. దీనికి సంబంధించి పార్లమెంట్‌లో మరోసారి తొలగింపు నోటీసు ఇవ్వడానికి ప్రతిపక్ష పార్టీలు సమాయత్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై, ఎలక్షన్ కమిషన్ తీరుపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన లేదా తొలగింపు నోటీసు ఇవ్వడం విపక్షాలకు ఇది మూడోసారి కావడం గమనార్హం. నిజానికి గతేడాది మార్చి 12న తొలిసారిగా విపక్షాలు రెండు సభల్లోనూ నోటీసులు ఇచ్చాయి. రాజ్యసభలో 63 మంది, లోక్‌సభలో 130 మంది ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు తిరస్కరించారు. ఆ తర్వాత ఏప్రిల్ 24న వివిధ పార్టీలకు చెందిన 73 మంది ఎంపీల సంతకాలతో రాజ్యసభలో మరో నోటీసు ఇచ్చారు. అందులో కుమార్‌పై తొమ్మిది తీవ్రమైన ఆరోపణలు చేస్తూ, ఆయన నిరూపితమైన అపచారం (ప్రూవ్డ్ మిస్‌బిహేవియర్) చేశారని పేర్కొన్నారు. ఈ నోటీసు ఇప్పటికీ రాజ్యసభ ఛైర్మన్ పరిశీలనలోనే పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు మూడోసారి రెండు సభల్లోనూ కొత్తగా నోటీసులు ఇవ్వాలని విపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. ఈసారి ఎలక్షన్ కమిషన్ లోపల కమిషనర్ల మధ్య వచ్చిన విభేదాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై వ్యక్తమైన అభ్యంతరాల ఆధారంగా తయారుచేసిన కొత్త నివేదికను ప్రధాన అస్త్రంగా మార్చుకోనున్నాయి. మరోవైపు జ్ఞానేష్ కుమార్‌తో పాటు ఎలక్షన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. ఢిల్లీ, శ్రీనగర్, పట్నా, రాంచీ, జైపూర్ వంటి ప్రధాన నగరాల్లో ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ హెడ్‌క్వార్టర్స్‌కు మార్చ్‌గా వెళ్తున్న ఆందోళనకారులపై భద్రతా సిబ్బంది వాటర్ క్యానన్లను ఉపయోగించారు. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్నా, ఛండీగఢ్ సహా పలు రాష్ట్రాల రాజధానుల్లో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. సీఈసీ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

నాకు మంత్రి పదవి పోవడంపై బాధగా లేదు..

కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



వరంగల్, సెప్టెంబర్ 29 తనకు మంత్రి పదవి పోవడం బాధగా లేదని ఎమ్మెల్యే కొండా సురేఖ వ్యాఖ్యానించారు. మంత్రిగా ఉంటే రాష్ట్రస్థాయిలో సేవచేసే అవకాశం తనకు ఉండేదని పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ జిల్లాలోని తన క్యాంపు కార్యాలయంలో చెక్కులను కొండా సురేఖ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పుడు వరంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించి అభివృద్ధి చేసే అవకాశం తనకు వచ్చిందని కొండా సురేఖ వెల్లడించారు. ఇకపై నియోజకవర్గంలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. వచ్చే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను గెలవడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తమ అనుచరులపై ఈగవాలిన ఊరుకోబోమని హెచ్చరించారు. మొన్న ఎంజీఎం దగ్గర బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారని ధ్వజమెత్తారు. వాళ్లు వాళ్లే తోసేసుకుని పోలీసులు కొట్టారని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారని కొండా సురేఖ విమర్శించారు. కొత్త కలెక్టరేట్ దగ్గర బీజేపీ నాయకులు నిరసన తెలిపి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. వరంగల్ అభివృద్ధిపై బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. వరంగల్‌లో పురాతన ప్రదేశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి.. అప్పుడు మాట్లాడాలని కొండా సురేఖ ఛాలెంజ్ చేశారు.

బిహార్, యూపీ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థుల ఖరారు



బిహార్, ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకూ మంగళవారం 10 మంది అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అలాగే మేజర్ నామినీల పేర్లను కూడా ప్రకటించింది. బిహార్ నుంచి నామినీలుగా ఎంపికైన వారిలో నావల్ కిశోర్ యాదవ్, డాక్టర్ ఎన్‌కే యాదవ్ ఉన్నారు. ఇక యూపీ నుంచి నామినీలుగా ఎంపికైన వారిలో కేదార్ నాథ్ సింగ్, హరికిశోర్ తివారీతో పాటు మరో నలుగురు కూడా ఉన్నారు. అయితే, రెండు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు 10 మంది అభ్యర్థులుగా ప్రకటించినప్పటికీ వారి పేర్లను ఇంకా వెల్లడించలేదు.

బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ

చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ



హైదరాబాద్,సెప్టెంబర్,29: తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో ‘తుగ్లక్ నిర్ణయం’గా ఆయన అభివర్ణించారు.

ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ‘ఎక్స్’ ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో ‘తుగ్లక్ నిర్ణయం’గా ఆయన అభివర్ణించారు.

సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు.

మహిళా పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్

పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుతో మర్యాదగా ప్రవర్తించాలి



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 29(డీకే చాటింపు): నిజామాబాద్ నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య,ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి తదుపరి పోలీస్ స్టేషన్ లో చెట్లు నాటారు. అనంతరం సిబ్బందికి సంబంధించి నటువంటి కిట్ ఆర్టికల్ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తదుపరి పోలీస్ స్టేషన్లో పూర్తిగా కలియతిరిగారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని కేసుల నమోదు , దర్యాప్తు పురోగతి , పెండింగ్ కేసులు , ఫిర్యాదుల పరిష్కారం , స్టేషన్ రికార్డుల నిర్వహణ , సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ సమగ్రంగా పరిశీలించారు. మహిళలు , బాలికలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు త్వరితగతిన స్పందించి, బాధితులకు భరోసా కల్పిస్తూ , చట్టపర మైన నిబంధనల ప్రకారం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా బాధితులు తమ సమస్యలను ఎటువంటి భయాందోళనలు లేకుండా పోలీసులకు తెలియజేసే విధంగా వారికి అనుకూల మైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా కృషి చేయాలి, అదేవిధంగా మహిళలు , బాలికలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును నిర్లక్ష్యం చేయకుండా , ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణిస్తూ , అవసరమైన ఆధారాలను సేకరించి , దర్యాప్తును నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు.కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు,బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా , గౌరవంగా వ్యవహరిస్తూ , వారి సమస్యలను ఓర్పుతో విని , చట్టపరమైన పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా మహిళలు , బాలికల భద్రతకు సంబంధించిన అంశాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24ఴ7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపే టప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. నిజామాబాద్ ఏసిపి ప్రకాష్,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీలత , మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లు ఎమ్. డి రహమతుల్లా , పి. రాజేశ్వర్ , పి. జాన్సన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల తరహాలో కర్నూలు దర్శనాలు



కర్నూలు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో భక్తుల దర్శనాల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై శ్రీశైల దేవస్థానంలో ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులందరితో విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ మార్పులను ఖరారు చేశారు.ఈ కీలక సమావేశంలో 45 అంశాలపై సమగ్రంగా చర్చించి?. అందులో 39 కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు. సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండే ఇబ్బందులు తొలగించి, మరింత సులభంగా దర్శనం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్ నాయుడు స్పష్టం చేశారు.నూతన రూల్స్ ప్రకారం? ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సిఫార్సు లేఖలపై ఇచ్చే ప్రొటోకాల్ టికెట్లను వచ్చే నెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారానే జారీ చేస్తారు.ఈ ప్రొటోకాల్ దర్శనం కోరుకునే వారు దర్శన సమయానికి కనీసం 48 గంటల ముందే తమ సిఫార్సు లేఖలను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.ఈ మార్పు ద్వారా భక్తుల రద్దీని సులభంగా నియంత్రించడంతో పాటు, దర్శన వేళల్లో మరింత పారదర్శకత వస్తుందని పాలకమండలి భావిస్తోంది.ప్రముఖుల సిఫార్సు లేఖల పేరిట జరిగే అక్రమాలను అరికట్టడంతో పాటు, సాధారణ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా వేగంగా దర్శనం పొందేందుకు ఈ చర్యలు ఎంతగానో తోడ్పడతాయని ఆలయ ఛైర్మన్ పేర్కొన్నారు.ఇక శ్రీశైలం క్షేత్రాభివృద్ధిలో భాగంగా భక్తుల వసతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. నూతన క్యూ కాంప్లెక్స్, ఏ-గ్రేడ్ శౌచాలయాలు, స్నానపు గదుల నిర్మాణం, తిరుమల తరహాలో పీఏసీ (పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటును ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల రాకపోకల సౌకర్యార్థం హిందూమాల సత్రం నుంచి కుమార సదనం వరకు?. యోగివేమారెడ్డి సత్రం వెనుక భాగంలో రూ. 24 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించనున్నారు.రాబోయే శ్రావణ మాసంలో భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన గోపురాలకు రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేయనున్నారు. భక్తుల విశ్రాంతి కోసం నందీశ్వర మరియు నీలకంఠేశ్వర డార్మెటరీలలో డక్టబుల్ ఎయిర్ కూలర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అలాగే క్యూ కాంప్లెక్సులో అదనపు వాటరు కూలర్లను అమర్చనున్నారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి?. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి దేశం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ ఆగమశాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 7 నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, హోమాలు, జపాలు మరియు పారాయణలు శాస్త్రోక్తంగా జరుగుతాయి.

ప్రభుత్వ డిగ్రీ,జూనియర్ కళాశాలకు

నూతన భవనాలు నిర్మించాలి

-విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి... -ప్రభుత్వ డిగ్రీ,జూనియర్ కళాశాలకు నూతన భవనాలు నిర్మించే వరకు విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ పోరాటం... -

రెండోవ రోజుకు చేరుకున్న ఎస్ఎఫ్ఐ దీక్షలు...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)నారాయణపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు (మంగళవారం)రెండోవ రోజుకు చేరుకుంది.రెండోవ రోజు దీక్షలను ఎన్.పి.ఆర్.డి జిల్లా కార్యదర్శి కే.కాశప్ప ప్రారంభించారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్ యాదవ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు జి. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద,మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే సరైన మౌలిక వసతులు కల్పించాలన్నారు.ప్రభుత్వ డిగ్రీ,జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు నరహరి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కళాశాలలకు శాశ్వత భవనాలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మడివాల కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఎంపీఆర్డీ జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని,ముఖ్యంగా విద్యార్థినులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భాను ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ,జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించే వరకు విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని రాణి మాట్లాడుతూ కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా విద్యార్థినులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు,తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ,జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించడంతో పాటు,విశాలమైన తరగతి గదులు,ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, మరుగుదొడ్లు,తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు.లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విశాఖపట్నం నుంచి భోగాపురం కమర్షియల్ సేవలు



విజయనగరం : అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక రంగాలకు కీలకంగా మారనుందని అధికారులు చెబుతున్నారు. ప్రారంభోత్సవంలో గిరిజన కళాకారుల ప్రత్యేక ప్రదర్శన ద్వారా గిన్నిస్ రికార్డు సాధించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.ఇదిలా ఉండగా, శ్రీకాకుళం జిల్లాలోని ప్రజలు కూడా భోగాపురం విమానాశ్రయం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు సజావుగా సాగాలని కోరుతూ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సౌర హోమం, అష్ట దిగ్పాలకుల ఆవాహన, నవగ్రహ ఆవాహన వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు.కేంద్ర పౌరవిమానయాన శాఖ తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలు నిలిపివేయనున్నారు. ఈ నిర్ణయం 30 ఏళ్ల కాలానికి వర్తిస్తుందని పేర్కొంది. అయితే జాతీయ అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపు ఉంటుందని తెలిపింది. విశాఖ విమానాశ్రయం నుంచి భారత వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విభాగాలకు చెందిన విమానాలు, ప్రభుత్వ అతిథుల విమానాలు, వీఐపీ, లీజ్ విమానాలు కొనసాగుతా యని కేంద్రం స్పష్టం చేసింది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలకు కూడా అనుమతి ఉంటుందని వెల్లడించింది.ప్రస్తుతం విశాఖపట్నం విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్ కోడ్ 'ఐజి'ను ఆగస్టు 17 నుంచి భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేయనున్నారు. అలాగే భోగాపురం విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా అధికారిక గుర్తింపు లభించింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం విడుదల చేసింది.జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తాజాగా కేంద్రం ఆ నిర్ణయాన్ని అధికారికంగా ఆమోదించింది. దీంతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుంది.

ఎర్రమిర్చికి ఊహించని ధర



గుంటూరు, : మిర్చి పంటను సాగు చేయడం కత్తి మీద సామే. ఏ మాత్రం తేడా వచ్చినా పంటంతా తెగుళ్లే. ఒకవేళ తెగుళ్ల నుంచి కాపాడుకున్నా నాణ్యమైన దిగుబడి రాదు. సరే ఆ వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండదు. దళారులు ఎంత చెప్తే అంతకి ఇచ్చి వెళ్తుంటారు. కానీ ఇక్కడో రైతు బయ్యర్లకే దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. నెంబర్ వన్ నాటు రకాన్ని సాగు చేసి ఎర్రబంగారంలా మెరిసే మిర్చిని సాగు చేశాడు. రూ. 32 వేలు పలికినా ఇవ్వకుండా రూ. 40 వేల గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాడు.రైతు వేసిన పంట ఊహించిన దాని కంటే ఎక్కువ ధర పలికిందంటే ఆ రైతు పంట పండినట్టే. ఇక్కడ కూడా ఓ రైతు ఎర్రబంగారం సాగు చేశాడు. గుంటూరు మిర్చి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. మిర్చే కాదు ధర కూడా ఘాటెక్కింది. టాప్ క్వాలిటీ రావడంతో దళారులు ఆ పంట కోసం ఎగబడుతున్నారు. క్వింటాకు రూ. 32 వేలు ఇస్తామని ముందుకొస్తున్నా.. ఇంకాస్త ఎక్కువ ధర పలుకుతుందన్న ధీమాతో ఆ రైతు విక్రయించడం లేదు.గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు చిట్టినేని అమర్‌నాథ్ నాటు రకం సూపర్ 10 డీలక్స్ మిర్చిని నాలుగు ఎకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో తొలి కాపు రాగా.. ధర పెద్దగా లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజ్‌లో పంటను నిల్వ చేశాడు.ఇటీవల కొద్ది కాలంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో ధరలు రైతులకు అనుకూలంగా ఉండటంతో తన పంటను విక్రయించేందుకు అమర్‌నాథ్ మూడు లాట్ల శాంపిల్స్‌ను తీసుకొచ్చాడు. యార్డులోని శ్రీ కృష్ణవేణి చిల్లీస్ దిగుమతి షాపు వద్దకు తీసుకురావడంతో ఎర్రగా నిగనిగలాడుతున్న ఆ టాప్ క్వాలిటీ మిరపకాయలను చూసి ఎగుమతిదారులు ఆశ్చర్యపోయారు. దాంతో ఆ మిర్చిన కొనేందుకు చాలా మంది ఆసక్తిచూపారు.మిర్చి క్వింటా ధర రూ. 25 వేల వరకే ఉండేది.. అలాంటిది క్వాలిటీ మిర్చికి తోడు పోటీ కూడా పెరగడంతో రికార్డు స్థాయిలో రూ. 32 వేల వరకు వేలం వెళ్లింది. అయితే, రూ. 40 వేలకు అమ్మాలన్న ఉద్దేశంలో రైతు అమర్‌నాథ్ ఉన్నాడు. దాంతో పంద టిక్కీల మిర్చి యార్డులోనే ఉంది. తాను అనుకున్న ధర వచ్చిన తర్వాతే విక్రయించాలని రైతు ఉన్నాడు. పంటకు తెగులు సోకినా తగిన సంరక్షణ చర్యలు తీసుకుని క్వాలిటీ ఏ మాత్రం దెబ్బతినకుండా సాగు చేశాడని.. అందుకే ఈ స్థాయిలో మిర్చి రికార్డు ధర పలికింది అంటూ గుంటూరు ఏఎంసీ వర్గాలు అంటున్నాయి.

పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీ

విజయవాడ, : రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా అందిస్తున్న బియ్యాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించకపోవడానికి గల కారణాలపై పౌర సరఫరాల శాఖ సమగ్ర అధ్యయనం నిర్వహించింది. ప్రతి కిలోపై రూ.56 వరకు రాయితీ ఇస్తున్నప్పటికీ వినియోగం తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం ప్రస్తుతం పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతేనని గుర్తించినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే స్టీమ్ రైస్ అందిస్తే వినియోగం పెరగడంతో పాటు బియ్యం పక్కదారి పట్టకుండా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని 42 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద స్టీమ్ రైస్‌ను విజయవంతంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ విధానాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ అమలు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ప్రతిపాదించగా సానుకూల స్పందన లభించిందన్నారు.దేశంలోనే తొలిసారిగా కాకినాడ జిల్లాలో పిడిఎస్ ద్వారా స్టీమ్ రైస్ పంపిణీకి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో రేషన్ కార్డుదారులు, పాఠశాలలు, హాస్టళ్ల అవసరాల కోసం నెలకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుందని అంచనా వేశారు. పైలట్ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్రం అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ ధాన్యం సేకరణకు అంగీకరించిందని, రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని చెప్పారు.ఈ త్రైమాసికంలో రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్'లను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్‌సీసీఎఫ్‌తో ఒప్పందం కుదిరిందని, ఈ మార్టుల్లో సుమారు 70 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు లభిస్తాయని చెప్పారు. ఆగస్టు 1 నుంచి 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక అవుట్‌లెట్లలో బీపీటీ స్టీమ్ రైస్‌ను కిలో రూ.52కు, గ్రేడ్-1 రా రైస్‌ను రూ.50కు విక్రయించనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో స్వర్ణ రకం బియ్యాన్ని కూడా రైతు బజార్ల ద్వారా రూ.40కే అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ప్రతి రేషన్ కార్డుదారుడికి 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు.బియ్యం ప్యాకింగ్ నుంచి వినియోగదారుడి వరకు పూర్తి ట్రాకింగ్ కోసం క్యూఆర్ కోడ్‌కు బదులుగా ఆర్ఎఫ్ఐడీ విధానాన్ని కాకినాడ జిల్లాలో పైలట్‌గా అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే సీబీడీసీ ఆధారిత డిజిటల్ వాలెట్ విధానాన్ని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ విధానం వల్ల ప్రజలకు రాయితీ నేరుగా అందడంతో పాటు రేషన్ డీలర్ల కమిషన్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదని మంత్రి స్పష్టం చేశారు. .

దస్తావేజులేఖర్ల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి, : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.396తో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది దస్తావేజులేఖర్లు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధి ప్రమాదంలో పడిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటిలో దస్తావేజులేఖర్లు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పీపీపీ విధానంలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుతో చిన్న వృత్తిదారుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. దస్తావేజుల తయారీ హక్కులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ఏళ్ల తరబడి ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

-"క్రోటన్ ఉబ్బలమడు గెన్సిస్" అని పేరు పెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

-తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి

విజయవాడ : తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్ తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం, సెప్టెంబర్,29, 2026

సార్వజనీన ఆరోగ్య సంరక్షణ

మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్న ఆకాంక్షలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మెరుగైన జీవితాలు సాధ్యపడతాయన్న ఆశలు కలుగు తాయి. ప్రపంచ పర్యావరణంలో ప్రతికూల మార్పులు, సాయుధ ఘర్షణలు,వాణిజ్య యుద్ధాలు, పొంచిఉన్న అంటువ్యాధులు, తీవ్రత రమవుతున్న ఆర్థిక అసమానతలు, సంకుచిత దేశభక్తి మాటున చెలరేగుతున్న విద్వేషపు జాతి హననాలు, వర్ణ వివక్ష వంటి అనేక సమస్యలు, సంక్షౌభాల నడుమ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం శాంతి,సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్న ఆశాభావం జనాల్లో నెలకొని ఉన్నది.ఆయురారోగ్యాలతో వర్ధిల్లమని మనం దీవిస్తుంటాం. అయితే మన ఆరోగ్య రంగం పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ వైద్య సేవలు ఏమేరకు ఆశాజనకంగా ఉన్నాయి. అన్న ప్రశ్న అదే రంగంలో పనిచేస్తున్న నాకు ఎదురవుతుంది. కెనడా లోని అల్‌బెర్టా రాష్ట్రంలోని ఓ ఆసుపత్రిలోఎమర్జెన్సీ వైద్యం కోసం వచ్చి 8గంటలు వేచి చివరికి ప్రాణాలు కోల్పోయిన 44ఏళ్ళ భారతీయ మూలాలు కలిగిన వ్యక్తి విషాద కథనం మనం విన్నాం.మన దేశంలోనూ అలాంటి పరిస్థితు లే నెలకొని ఉన్నాయి. వైద్యుడు అందుబాటులోకి వచ్చే లోపే ప్రాణాలు కోల్పోతున్న పేషెంట్ల సంఖ్య తక్కువేమీ కాదు. ఇక డబ్బుగల వారికి జబ్బు చేసినా ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసయినా తగిన వైద్యం పొందగలుగుతున్నారు. ఈ మధ్యనే ఒక బడా కార్పొరేట్ ఆసుపత్రి తన ఆదాయం ప్రతి రోగికి తలసరిన 9 శాతం పెరిగి సుమారుల డెబ్బై వేల రూపాయలకు పైగా గిట్టుబాటు అవుతున్నదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో రెండవ త్రైమాసిక ఆర్జన వివరాలు ఆ కార్పొరేట్ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులకు వీనుల విందుగా ఉండి ఉంటాయిగానీ మనకు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. ప్రజారోగ్య సంరక్షణ పట్ల నాకు ఉన్న అనురక్తి దృష్ట్యా×ప్రభుత్వం సార్వజనీన ప్రజారోగ్య సంరక్షణ కోసం కేవలం మాటలకే పరిమితమైతే సరిపోదనిపిస్తుంది. ఈ విశాల భూభాగంలో నివసించే ప్రతి పౌరుడికీ కావాల్సిన సకల వైద్య సేవలు సులువుగా అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సుధృడమైన కృషి చేపట్టాలి. ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి అని ప్రభుత్వం గ్రహించాలి. అంతేగాక ఆరోగ్యాన్ని మానవ హక్కుగా పరిగణించాలి. ఆ హక్కును పరిపుష్టం చేసే నైతిక లక్ష్యంతో, భౌగోళిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి పౌరులందరికీ సార్వజనీన వైద్య సౌకర్యం కల్పించేలా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కల్పించాల్సిన ఆరోగ్య సేవలు విస్తృతంగా ఉండాలి. రోగ నివారణ, రోగ నిర్ధారణ, తగిన సమయంలో తగిన వైద్యం అందేలా చూడడం, అవసరమైన మేరకు ఆసుపత్రిలో సంరక్షణ కల్పించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం వంటి అంశాలన్నీ నెరవేర్చాలి. కఠోర వాస్తవాలు: క్రియాశీల, సమత్వ, సహానుభూతితో కూడిన ఆర్థికంగా అందరికీ మెరుగైన×ఆరోగ్య వ్యవస్థను అందుబా టులోకి తీసుకురావడానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చెయ్యడం మోలికమైన అవసరమని గుర్తించాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆర్థికంగా, మానవ వనరుల పరంగా అత్యంత పటిష్టంగా ఇంటింటికీ వైద్య సేవలు, అందించేంత శక్తివంతంగా ఉండాలి. వీటిని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలుగా, విశాల వేదికగా మలచడం ద్వారా అనేకానేక మానవాభివృద్ధి కార్యక్రమాలకు వీటినే మందుపీఠిన ఉండేలా రూపొందించవచ్చు. అయితే ప్రాథమిక ఆరోగ్య సేవలు విడిగా మనజాలవు. కొంత మందికి మరింత మెరుగైన వైద్యం అవసరం పడుతుంది. తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా సెకండరీ లేదా ప్రాంతీయ వైద్య సేవలు కూడా అందుబా టులోకి తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' కేంద్రాలుగా పని చెయ్యాలి. అవసరమైన వారికి మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందేలా చూడడంతో పాటు ఆసుపత్రి నుండి తిరిగి ఇంటికి వచ్చేశాక కూడా వైద్య పర్యవేక్షణ కొనసాగేలా చూడాలి. ఇదీ ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నమూనా. కాని ప్రస్తుతం మన ఆరోగ్య వ్యవస్థ ఈ నమూనాకు అత్యంత దూరంలో ఉందనేది కఠోర వాస్తవం. మన దేశంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సేవలు అస్తుబిస్తుగా ఉన్నాయి. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటు చాలా బలహీనంగా ఉన్నది. ఇక 'జాతీయ ఆరోగ్య కార్యక్రమం'లో తమ స్థానం ఏమిటో తెలియని అయోమయ స్థితిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులలో కోతలు పడుతున్నకొద్దీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ డోలాయమాన పరిస్థితులను ఎదుర్కొంటు న్నది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు
ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

గోదావరి పుష్కర పనులు

అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్29(డీకే చాటింపు) : గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కందకుర్తి, యంచ వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన కోసం పనులను ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్ష చేశారు.గోదావరిపుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పుష్కరాలకు గడువు సమీపిస్తున్నందున పనులను తక్షణమే చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రంతో పాటు బాసరకు ఆనుకుని అత్యంత చేరువలో ఉన్న యంచవద్దఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకువీలుగాశంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కర ఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు. ఎస్సారెస్పీ లో ప్రస్తుతం 46 టీ.ఎం.సీల వరకు నీరు నిలువ ఉందని, 20 నుండి 25 టీ.ఎం.సీలకు నీటి మట్టం చేరిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. మిగితా పనులను వెంటదివెంట చేపట్టి, మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. కందకుర్తి, యంచతో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ ముఖ్య ప్రతినిధుల జిల్లా స్థాయి సమావేశం



30న చలో హైదరాబాద్ ధర్నా

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 29(డీకేచాటింపు): ధర్మ సమాజ్ పార్టీ మరియు వీజీూ వ్యవస్థాపకులు డా విశారదన్ మహారాజ్ పిలుపుమేరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ కేంద్రంలో జిల్లా MJS & DSP జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించు కొవడం జరిగింది.ఇట్టి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. 30వ తేదీన హైదరాబాద్ లో జరిగే ధర్నా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి ఎస్సి ఎస్టి జాయింట్ యాక్షన్ కమిటీ మరియు ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం కు వెళ్లాలని డి.ఎస్.పి రీజినల్ ఇంచార్జ్ సుమన్ మహారాజ్ అన్నారు. అక్టోబర్ 15న నిజామాబాద్ జిల్లాలో జరగబోయే మాదిగల ఆరాధ్య దైవం ఆది జాంబవ మహారాజ్ మరియు గురు సంత్ రవి దాస్ మహారాజ్ శోభాయాత్రవిజయవంతం చేయాలనికోరారు. వారి వారి మండలాలకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం జన సమీకరణ మరియు ధన సమీకరణ కోసం ప్రతి రోజు పని లో ఉండాలని తీర్మానం చేసుకోవడం జరిగింది నూతనంగా మహారాజుల కాలనీ బోర్డ్స్ అక్టోబర్లో ఏర్పాటు చేయాలనీ పేర్కొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో వీఖజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు , డైరెక్టర్ సంతోష్ , MJS 12 జిల్లాల ఇంచార్జి రాష్ట్ర కో కన్వీనర్ ప్రేమ్ కుమార్ మహారాజ్ ,ణూా జిల్లా అధ్యక్షులు మహిపాల్ మహారాజ్ ,వీజీూ జిల్లా ఉద్యోగ బాధ్యులు సురేష్ ,ప్రకాష్ ,వీజీూ జిల్లా అధ్యక్షులు రమేష్ మహారాజ్ ,జిల్లా నాయకులు దిలీప్ మహారాజ్,సుభాష్ మహారాజ్,కిరణ్ మహారాజ్(డీఎస్పీ దుబాయ్ ఇంచార్జ్),మురళి, వివిధ మండలాల DSP అధ్యక్షులు మహేష్ ,ఉమేష్ ,శ్రీకాంత్, నిశాంత్,గంగాధర్, భాస్కర్ , వీజీూ మండలాల అధ్యక్షులు భూమేష్ ,కిషన్ ,గంగాధర్ ,లుపాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా సుంకరి రంగన్న నియామకం



ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 29(డీకే చాటింపు).....నిజాంబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ మున్సిపల్ పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ సుంకరి రంగన్న నిజమాబాద్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు.

వరుదు కల్యాణికి మొండి చేయేనా..?

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ కావడం, దాని చుట్టూ ఇప్పుడు వైసీపీ అంతర్గత రాజకీయాల్లో నడుస్తున్న డ్రామాలు చూస్తుంటే సామాన్య కార్యకర్తలకు ఇదేం మాస్టర్ ప్లాన్ సామీ అని తలపట్టుకోవడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. మండలి వైస్ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ పదవీకాలం ముగిసిపోయింది. ప్రస్తుతం మండలిలో వైసీపీకి ఇంకా సంఖ్యాబలం ఉంది కాబట్టి, ఆ ఉపసభాపతి పీఠం ఆ పార్టీకే దక్కనుంది. సరిగ్గా ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి మార్క్ అన్ ప్రిడిక్టబుల్ వ్యూహం మళ్లీ రచ్చకెక్కింది.సాధారణ పొలిటికల్ లాజిక్ ప్రకారం ఆలోచిస్తే.. ప్రస్తుతం పార్టీ ఘోర పరాజయం తర్వాత కోలుకోవడానికి కూటమికి బదులిచ్చే సామాజిక సమీకరణాలు వాడాలి. పోయిన స్థానం ముస్లిం మైనారిటీది కాబట్టి మళ్లీ అదే వర్గానికి ఇస్తే ఆ సామాజిక వర్గానికి మంచి సంకేతం వెళ్తుంది. లేదా, కూటమిని డిఫెండ్ చేయడానికి కాపులకో, లేదంటే గట్టిగా వాయిస్ వినిపించే బిసి వర్గానికి చెందిన వరుదు కల్యాణి లాంటి నాయకురాలికో ఆ అవకాశం ఇవ్వాలి. పొద్దున లేస్తే మైకుల ముందు నిలబడి, కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ పార్టీ జెండా మోస్తున్న వరుదు కల్యాణి లాంటి వారికి ఇస్తే క్యాడర్‌లో కూడా ఒక రకమైన జోష్ వస్తుంది. లేదంటే తమ పక్కా ఓటు బ్యాంక్ అయిన దళితులకో, రెడ్డి సామాజిక వర్గానికో ఇచ్చి సంతృప్తి పరచవచ్చు.కానీ, వైఎస్ జగన్ ఆలోచనలు వేరే స్థాయిలో ఉంటాయి కదా! రాజకీయంలో లాజిక్కులు వెతికేవారికి ఆయన ఎప్పుడూ షాక్‌లే ఇస్తారు. ఏ రాజకీయ లెక్కలకూ అందకుండా, ఈ కీలక పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాధవరావుకు అప్పగించాలని డిసైడ్ అయ్యారట. టీవీ డిబేట్లలోనో, బయటో పార్టీ కోసం గట్టిగా మాట్లాడలేని, రేపు పొద్దున పార్టీలో ఉంటారో లేదో కూడా గ్యారంటీ లేని నేతకు ఈ చాన్స్ ఇవ్వడం చూసి వైసీపీ సొంత నేతలే జుట్టు పీక్కుంటున్నారు. మాట్లాడేవారికి పదవులు ఉండవు.. పదవులు వచ్చేవారు మాట్లాడరు అనే కొత్త సూత్రాన్ని జగన్ ఇక్కడ అమలు చేస్తున్నారని పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

రెడ్ క్రాస్ అభివృద్ధికి కలిసి పని చేయండి : కలెక్టర్



జనగామ, సెప్టెంబర్ 29 డీకే చాటింపు జిల్లా ప్రతినిధిజనగామ జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ అభివృద్ధికి అందరు కలిసి పనిచేయాలని జనగామ జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ సభ్యులకు సూచించారు. నూతనంగా ఎన్నికయిన కమిటి సభ్యులు జిల్లా ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ జా ను కలెక్టర్ కార్యాలయంలో కలిసిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పై సూచన చేశారు.ఆఫీస్ బేరర్స్ పరిచయం చేసుకుంటున్న క్రమంలో మూడవ సారి చైర్మన్ గా ఎన్నికైన డా.లవకుమార్ రెడ్డిని అభినందిస్తూ జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ నీ బలోపేతం చేయాలని అన్నారు.జనగామ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కి 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎన్నిక కావాలి ఇందుకోసం 17 మంది సభ్యులు నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి ఘనపూర్ స్టేషన్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.కిరణ్ ప్రకాశ్ కు మర్పించారు. ఏకగ్రీవం కావడానికి అనుగుణంగా కన్న పరశురాములు,కృష్ణజీవన్ బజాజ్ లు పోటీ నుండి ఉపసంహరించు కోవడంతో మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి వెంటనే ఆఫీసు బేరర్స్ ఎన్నిక నిర్వహించి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ప్రకటించారు.జిల్లా కలెక్టర్ ప్రెసిడెంట్ గా వ్యవహరించే ఈ కార్యవర్గంలో చైర్మన్ గా డా.డి.లవకుమార్ రెడ్డి,వైస్ చైర్మన్ గా ఇ.ప్రభాకర్ రెడ్డి,కోశాధికారిగాగాదె క్యాథరిన్,రాష్ట్ర ఎంసి.సభ్యునిగా దొంతుల శేఖర్,మేనేజింగ్ కమిటీ సభ్యులుగా వేమల్ల నరసింహారెడ్డి,ఎస్.శివరాజ్ యాదవ్, సిహెచ్ సురేందర్ రెడ్డి,డా.పి.సత్యం, బి.రజినీ,జైన రమేశ్,పప్పు వెంకట్ రెడ్డి, పి.శ్రీనివాస్, పేర్వారం ప్రభాకర్,డా.ఏ.హేమంత్ రాజ్,ఎం.ఆంజనేయులు ఎన్నికయ్యారు.

అనవసర వివాదాలు..!

హైదరాబాద్, : మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణ రావు..జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందు కు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష.. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిం చారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీ మ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమా నాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామా రెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవిఅందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయన ను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలం గాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకా రులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్ధించు కుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బెరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

వారం రోజులపాటు టెలిగ్రామ్ యాప్‌పై నిషేధం



న్యూఢిల్లీ : ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌ను వారం రోజులపాటు కేంద్రప్రభుత్వం నిషేధించింది. దేశంలో నుంచి ఈ నెల 22 వరకూ నిషేధం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విజ్ఞప్తితో ఈ కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ (యుజి) 2026 పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరీక్షను ఈ నెల 22న మరోసారి నిర్వహించనున్నారు. ఈ పునఃపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను మోసం చేయడానికి టెలిగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ను మోసపూరిత ముఠాలు ఉపయోగించుకుంటున్నాయని ఎన్‌టిఎ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. అనేక టెలిగ్రామ్ గ్రూపుల్లో నకిలీ పరీక్ష పత్రాల గురించి ప్రచారం చేస్తూ, వాటి కోసం డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులను మోసం చేస్తున్నాయని ఎన్‌టిఎ తెలిపింది. ఈ యాప్‌ను నిషేధిస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇంతటి భారీ స్థాయిలో పనిచేస్తున్న ఒక మెసేజింగ్ యాప్‌ను ఒక పరిమిత కాలానికైనా సరే, భారత్‌లో నిషేధించడం ఇదే మొదటిసారి. ఈ నెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను భారత్‌లో డిసేబుల్ చేయాలని టెలిగ్రామ్‌ను కేంద్రం ఆదేశించింది.

టైమ్‌స్టాంప్‌ను అలాగే ఉంచుతూ గతంలో పోస్ట్ చేసిన మెసేజ్‌లను సవరించడంతోపాటు, పేపర్ లీక్ సాక్ష్యాలను తారుమారు చేసేందుకు నిందితులు ఈ ఫీచర్‌ను దుర్వినియోగ పరుస్తున్నట్లు కేంద్రానికి ఎన్‌టిఎ ఫిర్యాదు చేసింది. తమకు ప్రశ్నాపత్రం యాక్సెస్ ఉందని మోసపూరిత ప్రచారం చేస్తోన్న అనేక ఛానళ్లు, గ్రూప్‌లు, బాట్‌లను అధికారులు ఇంతకు ముందే తొలగించారు. తాజా నిర్ణయంతో చట్టబద్ధమైన యూజర్లకు అసౌకర్యం ఏర్పడుతుందనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలో అత్యంత కీలమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్ సమగ్రతను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకున్నామని కేంద్రం పేర్కొంది.

ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టం



మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఆ దేశంలో పెట్టుబడులు పెట్టాల్సిన బాధ్యత తమకేమీ లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 సదస్సులో ఆయన ప్రసంగిస్తూ ఇరాన్‌లో తాము పెట్టుబడులు పెట్టబోమని స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సమూపార్జించుకోకుండా చూడడమే ఒప్పందం యొక్క ప్రధాన ఉద్దేశమని అంటూ ఒకవేళ అదే జరిగితే ఆ దేశానికి పెను విపత్తు తప్పదని హెచ్చరించారు. ఇరాన్‌తో ఒప్పందం రెండో దశకు చేరుకుంటోందని ఆయన అన్నారు. 'ఇరాన్‌తో ఒప్పందం కుదిరింది. అది విజయవంతం అవ్వాలి. అప్పుడు రెండో దశకు వెళుతుంది. అది తేలికగానే జరుగుతుందని నేను అనుకుంటున్నాను' అని జీ-7 సదస్సు సందర్భంగా విలేకరులతో అన్నారు. కాగా ఒప్పందంపై సంతకాలు జరిగే కార్యక్రమం స్విట్జర్లాండ్‌లో జరుగుతుందని, దీనికి తమ దేశం తరఫున చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ హాజరవుతారని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి మజీద్ తక్త్-రవంచి అంతకుముందు తెలిపారు. ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోనే సంతకాలు జరుగుతాయని, అయితే ఏ ప్రదేశంలో జరిగేదీ ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. సంతకాల ప్రక్రియ పూర్తయిన వెంటనే తదుపరి విడత చర్చలు మొదలవుతాయని అన్నారు. అమెరికా తరఫున చర్చలలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాల్గంటారని తెలిపారు. యుద్ధం ముగియడం అంటే లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఆక్రమణ కూడా ముగిసినట్లేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు.

వైసీపీ నేతలతో డయాస్ షేరింగ్ వద్దు



విజయవాడ, : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు వ్యవహారంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వేదిక పంచుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బొండా ఉమ నుంచి తక్షణమే సంజాయిషీ తీసుకోవాలని చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన నుంచి వివరణ స్వీకరించే బాధ్యతను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులకు అప్పగించారు.వివరాల్లోకి వెళితే, ఇటీవల గుంటూరులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి బొండా ఉమ, అంబటి రాంబాబు హాజరయ్యారు. ఇద్దరూ ఒకే వేదికపై ఆశీనులవడమే కాకుండా, ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. నిత్యం చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే అంబటితో బొండా ఉమ వేదిక పంచుకోవడంపై సొంత పార్టీ శ్రేణుల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది.ఈ పరిణామంపై పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు తీవ్ర స్వరంతో స్పందించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని, 'విషవృక్షం' అని అభివర్ణించిన ఆయన, ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. "కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి, ప్రజలను విడదీయడమే వైసీపీ ఎజెండా.

ఆ పార్టీ పన్నే ఉచ్చులో ఎవరూ పడొద్దు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ వైసీపీ నేతలతో మన పార్టీ నాయకులు వేదిక పంచుకోకూడదు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని గట్టిగా హెచ్చరించారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించాలని చంద్రబాబు నేతలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. గతంలోనూ కొందరు నేతలు వైసీపీ నేతలతో కనిపించడం పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే బొండా ఉమ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. తాజా నిర్ణయంతో, ఈ తరహా విషయాల్లో ఉపేక్షించేది లేదని చంద్రబాబు పార్టీ శ్రేణులకు స్పష్టమైన సందేశం పంపినట్లయింది.

ఆదివాసీల సంస్కృతికి నిలువుటద్దం నాగోబా జాతర

తెలంగాణ సంస్కృతి అంటే రాజప్రాసాదాలు, శిల్పకళ వైభవం మాత్రమే కాదు. అడవి తల్లి ఒడిలో, కొండగుట్టల నడుమ ప్రకృతితో మమేకమైన జీవన విధానమే అసలైన తెలంగాణ తత్వం. ఆ జీవన తత్వానికి అద్దం పట్టే మహోత్సవమే నాగోబా జాతర. ఇది కేవలం ఒక ఆధ్యాత్మిక వేడుక కాదు. ప్రకృతి పూజగా, సామూహిక ఐక్యతకు ప్రతీకగా, తరతరాలుగా నిలిచిన సంప్రదాయ గౌరవంతో గిరిజన జీవన సంస్కృతిని ప్రతిబింబించే మహోత్సవంగా నాగోబా జాతర తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తుంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నాగోబా జాతర గిరిజన సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు.. ఆత్మగౌరవానికి ప్రతీక. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద జరిగే ఈ జాతరలో గోండులు, కొలాములు, నాయక్‌పోడ్లు, ప్రధాన్లు సహా అనేక ఆదివాసీ తెగలు తమ సంప్రదాయాలను ఆచరిస్తారు. నాగోబా దేవతను సర్పరూప దైవంగా భావిస్తూ, ప్రకృతిని తల్లి రూపంలో పూజించే గిరిజన విశ్వాసం ఈ జాతరలో స్పష్టంగా దర్శనమిస్తుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు, గిరిజనులు, పరిశోధకులు, పర్యాటకులు ఈ జాతరకు తరలివస్తారు. ఇది ఒక జాతరగా మొదలై, కాలక్రమంలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవంగా ఎదిగింది. అయితే ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ జాతర గతంలో మౌలిక సదుపాయాల కొరతతోనే కొనసాగింది. రహదారుల లేమి, వైద్య సౌకర్యాల లోపం, తాగునీటి సమస్యలు, భద్రతా ఏర్పాట్ల అసమర్థత భక్తులకు ఇబ్బందులు కలిగించాయి. ఈ పరిస్థితిని మార్చాలన్న స్పష్టమైన సంకల్పంతో ఈసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నాగోబా జాతరకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల విశ్వాసాన్ని పాలనా బాధ్యతగా భావిస్తూ, జాతరను రాష్ట్ర ప్రతిష్ఠకు ప్రతీకగా నిలపాలన్న దృక్పథంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోంది. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు ప్రణాళికలను రూపొందించి, భక్తుల సౌకర్యం కేంద్రంగా ఏర్పాట్లను చేపట్టింది. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక రహదారుల నిర్మాణం, విస్తృత పార్కింగ్ సదుపాయాలు, బస్సు రూట్ల పునర్వ్యవస్థీకరణ, ప్రత్యేక షటిల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వెయ్యికిపైగా బస్సులతో షటిల్ సేవలు అందిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నాగోబా జాతరలో ఆరోగ్య సేవలు అత్యంత కీలకం. అందుకే ప్రభుత్వం 24 గంటల వైద్య శిబిరాలు, మొబైల్ హాస్పిటల్స్, 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 500 మెడికల్ టీంలు, 50 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా సిద్ధమయ్యింది. తాగునీటి కోసం 1000 (వెయ్యికి పైగా ట్యాంకర్లు, వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయడంతోపాటు పరిశుభ్రత కోసం 1,000 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించింది. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా ఈ చర్యలు పాలనలో మారుతున్న దృక్పథానికి సంకేతంగా చూడాలి. భద్రతా ఏర్పాట్లలోనూ ప్రభుత్వం రాజీపడలేదు. 5 వేల మంది పోలీసులు, 2 వేల హోంగార్డులు, మహిళా పోలీస్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నాయి.



అప్పుడు గుహలు.. ఇప్పుడు బంకర్లు: ఉగ్రవాదుల కొత్త పన్నాగాలు..!

భద్రతా బలగాలకు చిక్కకుండా ఉగ్రవాదులు కొత్తకొత్త పన్నాగాలు పన్నుతున్నారు. ఉగ్రదాడులకు ముందు వారు దాక్కొనేందుకు గుహలకు బదులుగా బంకర్లను వాడుతున్నారు. జమ్మూకశ్మీర్ రాజౌరీలో సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు విస్తుపోయే విషయాలను గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఉగ్రవాదులు తాము నక్కే ప్రదేశాల విషయంలో మార్పులు చేసుకుంటున్నారు. తమ హైడవుట్స్‌గా గతంలో గుహలను ఉపయోగించుకున్న ఆ మూకలు.. అండర్‌గ్రౌండ్ బంకర్లను వాడుతున్నారు. గతేడాది కశ్మీర్ లోయలోని కుల్గామ్ అడవుల్లో నిర్వహించిన సెర్చ్ అండ్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు ఈ విషయాన్ని గుర్తించాయి. అవన్నీ తాత్కాలిక నిర్మాణాలు. భూమిని తవ్వి, దుంగలతో వాటిని నిర్మించుకున్నారు. చత్రు ప్రాంతంలో 12 వేల అడుగుల ఎత్తులో ఈ ఏడాది ప్రారంభంలో కూడా అలాంటి బంకర్ ఒకటి భద్రతా సిబ్బంది కంటపడింది. ఒకేసారి నలుగురు ఉండేంత విశాలంగా అది ఉంది. కొన్ని నెలల పాటు సరిపడా త్యావసరాలను అందులో నిల్వ చేసుకున్నట్లు బలగాలు వెల్లడించాయి. జోజి లా సొరంగ మార్గం పనులు పూర్తి ఉగ్రవాదులు గుహలు తాత్కాలిక బంకర్లకే పరిమితం కాకుండా దట్టమైన అడవుల్లో ఎక్కువ కాలం మన్నిక ఉండే పక్కా బంకర్ల నిర్మిస్తున్నారని భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఎక్కువకాలం అజ్ఞాతంలో ఉండేందుకు వీలుగా, ఆశ్రయం కోసం స్థానికుల మీద ఆధారపడకుండా ఉండేలా అవి ఉపయోగపడనున్నాయి. ఉగ్రవాదులు నక్కారనే ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా మే 22 నుంచి సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు ఆపరేషన్ షెరువాలీ పేరిట రాజౌరీలోని అటవీ ప్రాంతంలో గాలింపుచర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రమూకలకు, బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు దట్టమైన అడవిలోకి పారిపోయారు. రాజౌరీలోని గంబీర్ ముగ్లన్, డొరిమల్ ప్రాంతంలో ఉన్న హైడవుట్‌లో ఆశ్రయం పొందుతూ ఉండొచ్చని భద్రతా సిబ్బంది అనుమానిస్తున్నారు.ఉగ్రవాదులుతాము నక్కే ప్రదేశాల విషయంలో మార్పులు చేసుకుంటున్నారు. తమ హైడవుట్స్‌గా గతంలో గుహలను ఉపయోగించుకున్న ఆ మూకలు.. అండర్‌గ్రౌండ్ బంకర్లను వాడుతున్నారు. గతేడాది కశ్మీర్ లోయలోని కుల్గామ్ అడవుల్లో నిర్వహించిన సెర్చ్ అండ్ కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు ఈ విషయాన్ని గుర్తించాయి. అవన్నీ తాత్కాలిక నిర్మాణాలు.భూమిని తవ్వి, దుంగలతో వాటిని నిర్మించుకున్నారు. చత్రు ప్రాంతంలో 12 వేల అడుగుల ఎత్తులో ఈ ఏడాది ప్రారంభంలో కూడా అలాంటి బంకర్ ఒకటి భద్రతా సిబ్బంది కంటపడింది. ఒకేసారి నలుగురు ఉండేంత విశాలంగా అది ఉంది.

రెండో విడత చర్చలకు సిద్ధం వెల్లడించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చర్చలకు ఇరాన్ తిరస్కరణ



పాకిస్తాన్‌కు వెళ్లనున్న యూఎస్ ప్రతినిధులు
అమెరికాకు ఇజ్రాయిల్ గొప్ప మిత్రదేశం : ట్రంప్
చాలా దూరంలో తుది ఒప్పందం : ఇరాన్

బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసేస్తాం : హౌతీలు

న్యూయార్క్ / టెహ్రాన్ : పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరిపే చర్చల కోసం అమెరికా ప్రతినిధులు సోమవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారని ట్రంప్ ప్రకటించారు. ఆదివారం సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్‌లో..
ఇస్లామాబాద్‌లో ఇరాన్ ప్రతినిధులతో జరగనున్న రెండో విడత ముఖాముఖి చర్చలకు అమెరికా ఏ అధికారులను పంపుతుందో ట్రంప్ వివరంగా చెప్పలేదు. గత వారాంతంలో జరిగిన చర్చలలో అమెరికా ప్రతినిధి బృందానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వం వహించారు. కానీ ఆ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి.బుధవారం ముగియనున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని, శనివారం హోర్ముజ్ జలసంధిలో కాల్పులు జరపడం ద్వారా ఇరాన్ ఉల్లంఘించిందని ట్రంప్ ఆరోపించా రు. అమెరికా అందిస్తున్న ఒప్పందంలోని నిబంధనలను అంగీకరించకపోతే ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. "మేం చాలా సరసమైన, సహేతుకమైన ఒప్పందాన్ని అందిస్తు న్నాం. వారు దానిని అంగీకరిస్తారని నేను ఆశిస్తున్నాను. ఎందుకంటే, వారు అంగీకరించకపో తే, యూఎస్..ఇరాన్‌లోని ప్రతి ఒక్క విద్యుత్ ప్లాంటును, ప్రతి ఒక్క వంతెననూ నాశనం చేయబోతోంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో రాశారు.

ఆ సంకేతం ఇరాన్ ట్రూప్ అనుకొన్నాం: ట్రంప్



ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడే ఆపరేషన్ సమయంలో కొంతసేపు టెన్షన్ నెలకొన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆ ఫైటర్ జెట్ నుంచి ఎజెక్ట్ అయిన రెండో పైలట్ ఇరాన్ దళాల నుంచి తప్పించుకొని.. పర్వతాల్లో దాక్కొన్నాడని.. తొలుత అమెరికా నిఘా విభాగం అతడి లొకేషన్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. కానీ, అతడి వద్ద నుంచి వచ్చిన సందేశం తమను గందరగోళంలో పడేసిందని ట్రంప్ తెలిపారు. రేడియో సిగ్నల్స్‌లో 'భగవంతుడిదే శక్తి' అన్నట్లు వినిపించిందని.. అది ముస్లింలు మాట్లాడినట్లు అనిపించిందన్నారు. ఆ తర్వాత ఆ సిగ్నల్‌ను 'గాడ్ ఈజ్ గుడ్'గా మిలిటరీ అధికారులు వెల్లడించారు. దీంతో అతడు ఇరాన్ దళాలకు దొరికిపోయి ఉంటాడని అనుమానించారు. వారే తప్పుడు సిగ్నల్స్‌ను ట్రాన్స్‌మిట్ చేస్తున్నట్లు భావించారు. కానీ, ఆ తర్వాత సదరు పైలట్ సజీవంగానే ఉన్నాడని గుర్తించారు. వాస్తవానికి యుద్ధం, విపత్కర పరిస్థితుల్లో దళాల సభ్యులు చిక్కుకొన్నవేళ వెంటనే ముందుగా అనుకొన్న కోడ్‌ను మర్చిపోయి.. సహజసిద్ధ శైలిలో స్పందిస్తుంటారు. ఈ పైలట్ విషయంలో కూడా అలానే జరిగింది. దీంతో కొంతసేపు టెన్షన్ నెలకొన్నా.. ఆ తర్వాత వచ్చిన కోడ్ సరైనదేనని నిర్ణయించుకొని ఆపరేషన్ చేపట్టారు.

కీ రోల్ లో తమ్మినేని వాణి



శ్రీకాకుళం : మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుటుంబం చుట్టూ ప్రస్తుతం చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపి, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, ఫోర్జరీ వారసత్వ పత్రాలు సృష్టించి రూ. 4 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నిన కేసులో తమ్మినేని కుటుంబం ఇరుక్కుపోయింది. ఈ కేసులో హైకోర్టు నుంచి తమ్మినేని సీతారాం, ఆయన భార్య తమ్మినేని వాణిలకు తాత్కాలిక ముందస్తు బెయిల్ లభించినప్పటికీ, కుమారుడు చిరంజీవి నాగ్‌కు మాత్రం బెయిల్ నిరాకరించడంతో సీతారాం తీవ్ర ఇరకాటంలో పడ్డారు. దీనికి తోడు, అమదాలవలస పరిధిలోని ఖాళీ కాలేజీ వెనుక ఉన్న దళిత కుటుంబం భూమిని ఆక్రమించారంటూ వాణిపై తాజాగా మరొక ఫిర్యాదు పోలీసులకు అందిందిఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో తమ్మినేని సీతారాం కేవలం పేరుకే ప్రజాప్రతినిధిగా, స్పీకర్‌గా ఉండేవారని, అసలు డాన్ పాత్ర పోషించింది మాత్రం ఆయన భార్య తమ్మినేని వాణినే అనే టాక్ బలంగా ఉంది. సీతారాం సంపాదించిన రాజకీయ పదవులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వెనుకుండి సెటిల్మెంట్లు, భూ లావాదేవీలు, రాకెట్లు నడిపించడంలో ఆమె ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. కొడుకు చిరంజీవి నాగ్ కూడా పూర్తిగా తల్లి ఆదేశాల మేరకే పనిచేస్తూ ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణల్లో పాత్రధారులుగా మారారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆముదాలవలసలో జరిగిన పలు అక్రమాలు, దందాలు, భూ ఆక్రమణల వెనుక వాణి ముద్రలు ఉన్నాయనే అంశం ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తన గుప్పిట్లో ఉంచుకుని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే స్థాయికి ఈ దందాలు సాగాయని స్థానిక బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లను సాక్షులుగా పెట్టి, నకిలీ వారసులను సృష్టించి కోట్లాది రూపాయల ఆస్తులను తమ ఖాతాలో వేసుకున్నారనే నిజాలు దర్యాప్తులో వెలుగుచూడటం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. సీతారాం స్పీకర్ హోదాలో ఉండటంతో బాధితులు ఎవరూ బయటకు వచ్చి మాట్లాడటానికి ధైర్యం చేయలేకపోయేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడం, పోలీసు దర్యాప్తు పారదర్శకంగా సాగుతుండటంతో వాణి సృష్టించిన అక్రమాల చిట్టా అంతా బయటపడుతోంది. ప్రజాప్రతినిధిగా ఉన్న భర్త పవర్‌ను దుర్వినియోగం చేస్తూ ఆముదాలవలసను ఏలిన ఈ షాడో లీడర్ నిజస్వరూపం బయటపడటంతో, తమ్మినేని కుటుంబానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది.

మారని ఆ 15 మంది.. మూసధోరణిలోనే తమ్ముళ్లు



విజయవాడ, : తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి రాజకీయ వ్యూహాలు ఎల్లప్పుడూ అత్యంత పదునుగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఎమ్మెల్యేల పనితీరు, అవినీతి ఆరోపణలు, నియోజకవర్గాల్లో అసమ్మతి గ్రూపులు వంటి వ్యవహారాల్లో పడి ప్రజలకు దూరమవుతున్న దాదాపు 40 మంది ఎమ్మెల్యేలకు ఆయన గట్టి హెచ్చరికలే జారీ చేశారు. బాబు హెచ్చరికలతో ఆ 40 మందిలో దాదాపు 25 మందికి పైగా వెంటనే అలర్ట్ అయి, తమ తీరు మార్చుకుని దారికి వచ్చారు. అయితే, మిగిలిన ఆ 15 మంది మాత్రం ఇంకా పాత ధోరణినే కొనసాగిస్తూ నాయకత్వానికి మింగుడుపడని సవాలుగా మారారు.కానీ, ఈ 'బ్లాక్ లిస్ట్'లో ఉన్న మిగిలిన 15 మంది ఎమ్మెల్యేల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న నూతన వ్యూహం ఇప్పుడు ఏపీ రాజకీయంలో ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని నేరుగా సస్పెండ్ చేస్తే.. సామాజిక వర్గాల కార్డులు లేదా సానుభూతి రాజకీయాలు తెరపైకి వస్తాయి. పైగా నియోజకవర్గాల్లో అనవసరంగా రచ్చ జరుగుతుంది. సరిగ్గా ఈ సమయంలో కాగల కార్యాన్ని గాంధర్వులే తీర్చినట్లు .. టీడీపీ వదిలించుకోవాలని భావిస్తున్న ఆ అసంతృప్త నేతలను ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ మెల్లగా తమవైపు ఆకర్షించేలా పరిణామాలు జరిగిపోతున్నాయి.ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ సస్పెన్స్ దాగి ఉంది. అసలు ఆ ఎమ్మెల్యేలను వైసీపీనే ఆకర్షిస్తోందా? లేక అధిష్ఠానమే తెలివిగా, వ్యూహాత్మకంగా వారిని ఆ వైపునకు తోలేస్తోందా? అనేది సాధారణ రాజకీయ పరిశీలకులకు కూడా అర్థం కానంత నిశ్శబ్దంగా జరుగుతోంది. నియోజకవర్గాల్లో వారికి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గించడం, వినతులు పట్టించుకోకపోవడం ద్వారా.. మీకు ఇక్కడ భవిష్యత్తు లేదు అనే స్పష్టమైన సంకేతాన్ని పార్టీ పంపుతోంది. దీంతో దిక్కుతోచని ఆ నేతలు సహజంగానే తమ రాజకీయ ఉనికి కోసం వైసీపీ లేదా ఇతర మార్గాల వైపు చూసే పరిస్థితి ఏర్పడుతోంది.ఒకవేళ ఈ ఎమ్మెల్యేలు స్వయంగా టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకుంటే, అది చంద్రబాబుకు రెండు రకాలుగా లాభిస్తుంది. మొదటిది.. నియోజకవర్గాల్లో పనిచేయని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతల భారం పార్టీపై నుంచి దానంతటదే తొలగిపోతుంది. రెండోది.. రాబోయే ఎన్నికల్లో కొత్త రక్తానికి, కష్టపడే క్యాడర్‌కు టికెట్లు కేటాయించడానికి అధిష్ఠానానికి సంపూర్ణ క్లియరెన్స్ దక్కుతుంది. అనవసర వివాదాలకు తావివ్వకుండా, నేరుగా పోటు పొడవకుండా.. వదిలించుకోవాలనుకున్న వారిని స్వయంగా బయటకు వెళ్లేలా పరిస్థితులు కల్పించడమే చంద్రబాబు మార్క్ రివర్స్ సైకాలజీ అని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడుకుంటూనే, వ్యర్థాలను బయటకు నెట్టేసే ఈ నిశ్శబ్ద వ్యూహం చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు.

వ్యూహం మార్చుకుంటున్న వైసీపీ ఐ ప్యాక్ స్థానంలో కపిల్ సాహు



విజయవాడ, : 2029 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న విపక్ష వైసీపీ 'సరికొత్త వ్యూహం'తో ముందుకు వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కూటమిలోని మూడు పార్టీలు మళ్లీ కలిసికట్టుగా పోటీ అంటుండటంతో తమ గెలుపునకు సరైన వ్యూహం అవసరమని వైసీపీ గుర్తించిందని చెబుతున్నారు. దీంతో కొత్త రాజకీయ ఎత్తుగడతో ప్రజల ముందుకు రావాలనే ఆలోచనకు ఆ పార్టీ అధిష్ఠానం వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా పార్టీకి ఇప్పటివరకు రాజకీయ వ్యూహాలు అందిస్తున్న 'ఐ-ప్యాక్'ను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐ ప్యాక్ స్థానంలో తమిళనాడులోని టీవీకే పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన కపిల్ సాహును వ్యూహకర్తగా నియమించుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ సన్నాహాలు మొదలుపెట్టినట్లేనని అంటున్నారు రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్న వైసీపీ మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం అనేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రధానమైనది పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర ఒకటి అయితే, రెండోది పార్టీకి సరైన ఎన్నికల వ్యూహాలు అందించే బృందంగా భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సలహాలు, సూచనలతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకున్న వైసీపీ.. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బృందంలోని రిషిరాజ్ సింగ్ వ్యూహాలతో బోల్తా కొట్టింది. అయితే ఈ సారి తమిళనాడులో టీవీకే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కపిల్ సాహు వైపు చూస్తోందని కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది.ప్రశాంత్ కిషోర్ బృందానికే చెందిన కపిల్ సాహు ప్రస్తుతం సొంతంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా డిజిటల్ ప్రచారంలో కపిల్ సాహుకు మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడులో టీవీకే పార్టీకి రాజకీయ వ్యూహాలు అందించిన కపిల్ సాహు సైలెంట్ గా టార్గెట్ ను కొట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నికలకు ముందు ఎటువంటి అంచనాలు లేని టీవీకేని ఏకంగా ప్రభుత్వంలోకి తీసుకురావడానికి కపిల్ సాహు వ్యూహాలు బాగా పనికొచ్చాయని చెబుతున్నారు. రెండు బలమైన ప్రాంతీయ పార్టీలను మట్టి కరిపించి టీవీకేను ఓటర్లకు చేరువ చేయడంలో కపిల్ సాహు సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇదే అంశం వైసీపీని ఆకర్షిస్తోందని అంటున్నారు. కూటమి పార్టీలు కలిసి వుంటే ఓట్లు చీలడం కష్టమనే అభిప్రాయంతో ఉన్న వైసీపీ.. కూటమికి విరుగుడుగా వ్యూహాలు రచించే సరైన స్ట్రాటజిస్టు కోసం అన్వేషిస్తున్న క్రమంలో కపిల్ సాహు పేరు తెరపైకి వచ్చిందని అంటున్నారు. దీంతో ఆయనతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. కపిల్ సాహుతో ఒప్పందం కుదిరితే రిషిరాజ్ సింగ్ కు చెందిన ఐ-ప్యాక్ స్థానంలో కపిల్ సాహు సెల్ఫ్-ఎంప్లాయిడ్ బృందం తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కాగా, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తలపైనే ఆధారపడాలా? అన్న ప్రశ్న పార్టీలో విస్తృతంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీకి మరమ్మతులు చేయకుండా ఏం చేసినా ఉపయోగం లేదనే వాదన బలంగానే వ్యక్తమవుతోందని చెబుతున్నారు.

ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు , బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ (చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజాస్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు.పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు.సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం.గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి.చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖీ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికారాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 , మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలో సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున, ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమైన ప్రక్రియే కానుంది.ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లను కొనుగోలు చేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది. ఒక వేళ కౌన్సిల్‌లో ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉన్నా, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన మేయర్, చైర్మన్ బడ్జెట్ ఆమోదం, పాలనా నిర్ణయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అధికారంలో ఉండి కూడా పరోక్ష లబ్ధిని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం అనేది ఒక రాజకీయ తెగువగా అభివర్ణించవచ్చు.

నిదానంగా సాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ



విజయవాడ, : రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, నమోదవుతున్న స్పందన ఆశించిన స్థాయికి చేరుకోలేదని సమాచారం. దీంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.అధికారుల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నమోదైన పురోగతి 50 శాతం మార్కును దాటలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ శాతం మరింత తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఓటర్ల వివరాల సేకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. దీంతో నిర్ణయించిన గడువులోపు పూర్తి స్థాయిలో ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నగర ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినప్పటికీ, వాటిని పూర్తి వివరాలతో తిరిగి సమర్పించే విషయంలో ఓటర్ల నుంచి స్పందన తక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ కారణంగా మొత్తం ప్రక్రియ మందగించినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.రాజకీయ పార్టీల దృష్టిలో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం ఎన్నికల సమయంలో కీలక అంశంగా మారుతుంది. అందుకే అన్ని పార్టీలు తమ తమ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఫారాలు సకాలంలో సమర్పించేలా చూడాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలా మంది ఓటర్లకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేదని తెలుస్తోంది. ఫారాలు ఎలా నింపాలి, ఎవరికి ఇవ్వాలి, ఏ పత్రాలు అవసరం, పాత ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఏం చేయాలి వంటి విషయాల్లో ఇంకా సందిగ్ధత కొనసాగుతోందని సమాచారం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే అధికారులు, రాజకీయ పార్టీలు, స్థానిక సిబ్బంది కలిసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.ప్రత్యేకించి 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు, లేనివారు అనుసరించాల్సిన విధానం గురించి కూడా ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని సూచిస్తున్నారు.గడువు ముగిసే వరకు మిగిలిన రోజుల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలను మరింత చురుకుగా రంగంలోకి దించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.మొత్తంగా చూస్తే, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. సరైన సమాచారం, అవసరమైన పత్రాలు, సమయానికి దరఖాస్తుల సమర్పణ వంటి అంశాలపై ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉంటేనే ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది. లేకపోతే తుది ఓటరు జాబితాపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

13 మంది మంత్రులకే డేంజర్ బెల్స్



విజయవాడ, : ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే రెండేళ్లు పూర్తి చేసుకుంది. గత ఎన్నికల్లో ఎవ్వరూ ఊహించని విధంగా కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం అయిన వైఎస్సార్‌సీపీ అసలు ఇప్పట్లో పుంజుకుంటుందా ఆ పార్టీ కేడర్ రోడ్డెక్కుతారా ? అన్న సందేహాలు అందరిలోనూ కలిగాయి. కానీ ఆశ్చర్యంగా రెండేళ్లకే ఆ పార్టీ నాయకత్వం ఇస్తోన్న పిలుపునకు వైసీపీ కేడర్ ఉత్సాహంగా రోడ్లెక్కేస్తున్నారు. వైసీపీ ఇంత త్వరగా కోలుకుని మూడు పార్టీల కూటమి ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి వస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. దీనికి చాలా కారణాలు, తప్పులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం అయిపోయింది. ఎమ్మెల్యేలు ఎవ్వరూ ముఖ్యమంత్రి లేదా తమ పార్టీ అధినేతలు చెప్పినట్టు వినే పరిస్థితి లేదు. ఈ విషయంలో పరిస్థితి చేయిదాటిపోయింది. చంద్రబాబు గతానికి భిన్నంగా ఈ సారి తన కేబినెట్లో కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. వాళ్లలో ఎక్కువ మంది తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైన వారు కూడా ఉన్నారు. వీళ్లు తమ శాఖల పరంగా పట్టు సాధించడంలోనూ , ఇటు పార్టీకి ఉపయోగపడడంలోనూ దారుణంగా విఫలమవుతున్నారు. తెలుగుదేశం నుంచి కేబినెట్ మంత్రులుగా ఉన్న వారిలో ఏకంగా 13 మంది కొత్తవాళ్లే ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇదే కేబినెట్‌తో చంద్రబాబు ఎన్నికలకు వెళితే ఖచ్చితంగా ఇబ్బందులు తప్పవని పార్టీలో సీనియర్ నాయకులు తమ అంతర్గత చర్చల్లో సంభాషించుకుంటున్నారు.శాఖలకు మంత్రులుగా ఎవరు ఉన్నా .. జిల్లాల పరంగా పవర్ ఫుల్ వ్యక్తులు లేకపోతే ఖచ్చితంగా అది ఎన్నికలపై, జిల్లా అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికలకు మరో మూడేళ్ల టైం కూడా లేదు.. అందుకే డైనమిక్‌గా ఉండేవాళ్లకే కేబినెట్లో చోటు కల్పించాల్సిన అవసరం ఉంది. కేబినెట్లో ఉన్న మంత్రుల్లో ఎక్కువ మంది మంత్రుల పనితీరుపై కూడా చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ ఎంతమాత్రం సంతృప్తిగా లేరని అంటున్నారు. దసరాకు కాస్త అటూ ఇటూగా కేబినెట్లో మార్పులు, చేర్పులు ఉండవచ్చని అంటున్నారు. ఫస్ట్ టైం ఛాన్స్ మిస్ అయ్యిన వారికి రెండో విడతలో ఖచ్చితంగా ఛాన్స్ ఇస్తారని అంటున్నారు.తొలిసారి కేబినెట్లో చోటు దక్కించుకున్న వాళ్లలో అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, సుభాష్, సవిత, టి జీ భరత్, బి సి జనార్దన్ రెడ్డి , నిమ్మల రామానాయుడు, గుమ్మడి సంధ్యా రాణి, డోలా బాల వీరాంజనేయ స్వామి ఉండగా.. వీరిలో సగానికి పైగా మంత్రుల పనితీరు అసలు ఏ మాత్రం బాగోలేదంటున్నారు. విచిత్రం ఏంటంటే సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నచోట కూడా ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఆర్థికశాఖలపై కూడా ప్రజల్లోనూ, ప్రభుత్వ వర్గాల్లో అంత సంతృప్తి లేదంటున్నారు ఇక అన్నింటికి మించి కూటమి ప్రభుత్వంలో బిల్స్ వైసీపీ నేతలు చెప్పిన వాళ్లకు క్లీయర్ అవుతున్నాయన్నది బయటకు వచ్చేసింది. టీజీ భరత్ వివాద రహితుడే అయినా ఆయన శాఖ ఆయన చేతుల్లో లేదంటున్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ, పెట్టుబడి వచ్చినా అది లోకేష్ ఖాతాలోకి వెళ్లిపోతోంది.

జంతు పరిరక్షణ అందరి బాధ్యత...



హక్కులు కేవలం మనిషికే కాదు జంతువులకూ ఉండాలన్న ఉద్దేశ్యంతో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ అనిమల్ రైట్స్‌ని ప్రకటించారు. ఈ డిక్లరేషన్‌ని 1998లో ప్రపంచ దేశాలు ఆమోదించాయి. మానవ హక్కుల దినమైన డిసెంబర్ 10న జంతువుల హక్కుల దినంగా చేయడం ద్వారా మనుషులు, జంతువులు ఒకటేనన్న సందేశం అందరికీ అందించడమే ఈ దిన ప్రధాన లక్ష్యం. మాంసం కోసం, వినోదం కోసం మానవులు అనేక రకాలుగా జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతువులను ఉపయోగించు కుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భూమి మీద మనుషులతో పాటు ఎన్నో రకాల జంతువులూ ఉన్నాయి.

వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. జీవం నుండి జీవం రావడం మాత్రమే కాదు. ఒక జీవ జాతి అదే జీవ జాతి నుండి మాత్రమే ఉత్పన్నం అవుతుంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, ప్రధానంగా జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియజేస్తుంది. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా వచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి.

జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. జంతు సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడా నికి మొట్టమొదటి సారిగా 189 8లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతం గల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం దృవవరుస్తున్నది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువులపట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిసారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, జంతువులకూ తగిన గౌరవాన్ని అందజేయడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం.

ఈపీఎఫ్ఓ శుభవార్త.. 31 లక్షల మందికి బెనిఫిట్



ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈపీఎఫ్ఓవీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52 కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారనికేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొ చ్చారు.

త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఇప్పుడు ఈపీఎ ఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబం ధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం.

తెలంగాణలో భారీగా నిరుద్యోగం..!



హైదరాబాద్,: ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఆందోళనకరంగా మారింది. ప్రముఖ ఫైనాన్షియల్ సంస్థ బజాజ్ బ్రోకింగ్, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఎకనామిక్ సర్వే 2025–26' ఆధారంగా ఒక నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.9 శాతానికి చేరుకొని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.దేశ సగటు నిరుద్యోగిత రేటు 5.2 శాతంగా ఉండగా, తెలంగాణలో అది అంతకంటే 3.7 శాతం ఎక్కువగా ఉంది. ఏపీ (8.2%), కర్ణాటక (8.0%) వంటి పొరుగు రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో నిరుద్యోగం అధికంగా నమోదైంది. 2022లో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నిరుద్యోగిత రేటు కేవలం 0.7 శాతంగా ఉండేదని, అప్పట్లో ఉపాధి కల్పనలో రాష్ట్రం దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నివేదిక గుర్తు చేస్తోందిగత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున 2,037 ఉద్యోగ నియామకాలు జరగగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గత రెండున్నరేళ్లలో ఆ వేగం తగ్గి నెలకు సగటున 566 నియామకాలకు పరిమితమైందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు రాకపోవడం, ఉన్నఉద్యోగాల్లో కోతలు నిరుద్యోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.కొత్త ఉద్యోగనోటిఫికేషన్లు ఆశించిన స్థాయిలో రాకపోవ డం, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం కారణంగానేరాష్ట్రంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా



చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. "బైనా ప్రియమైన క్వెన్," అనిఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు. అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్-ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది.జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు. నిష్క్రమణలపై స్పందించేందుకు అలీబాబా అధికారులు స్పందించలేదు. ఇదేసమయంలో హాంకాంగ్ మార్కెట్‌లో అలీబాబా షేర్లు 2.8% తగ్గిముగిశాయి. మధ్యాహ్న ట్రేడింగ్‌లో 4% వరకు పతనమయ్యాయి. ఇటీవల క్వెన్ నవీకరించిన ఉత్పత్తులను విడుదల చేసిన రెండు రోజులకే ఈ రాజీనామా చోటుచేసుకుంది. క్వెన్ మొబైల్ యాప్ నెలవారీ క్రియాశీల వినియోగదారులు జనవరిలో 31.05 మిలియన్ల నుంచిలో 203 మిలియన్లకు పెరిగినట్లు ఎఐసిపిబి వెల్లడించింది.

ఆయుధాల ఉత్పత్తిపై అమెరికా కీలక సమావేశం!



ఇరాన్‌పై జరిగిన తాజా దాడుల అనంతరం తగ్గిన ఆయుధ నిల్వలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసే అంశంపై చర్చించడానికి ట్రంప్ పరిపాలన వైట్ హౌస్ లో అగ్రశ్రేణి రక్షణ కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం కానుందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సమావేశానికి లాక్‌హీడ్ మార్టిన్ మరియు రేథియాన్‌తో వంటి ప్రధాన కంపెనీల కార్యనిర్వాహకులను ఆహ్వానించినట్లు సమాచారం. ఉతయారీదారులను వేగంగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేయడంపై ఈ చర్చలు కేంద్రీకృతమవుతాయని ప్రణాళికకు పరిచయమున్న వర్గాలు పేర్కొన్నాయి. అయితే,సోషల్ మీడియా వేదికలో చేసిన ఒక పోస్టులో మాజీ అధ్యక్షుడు ట్రంప్ అమెరికా వద్ద ఆయుధ సామగ్రి "వాస్తవంగా అపరిమితంగా ఉంది" అని, అవసరమైతే ఈ సామగ్రితో యుద్ధాలను "ఎప్పటికీ" విజయవంతంగా కొనసాగించగలమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పెంటగాన్ నిల్వల పునరుద్ధరణ చర్యలు, రాజకీయ ప్రకటనల మధ్య వ్యత్యాసంపై చర్చ కొనసాగతోంది.

చాట్‌జిపిటికి పెంటాగన్‌తో ఒప్పందం దెబ్బ..!

అమెరికా రక్షణ శాఖ (పెంటాగన్)తో ఓపెన్ ఎఐ కుదుర్చుకున్న వివాదాస్పద ఒప్పందంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్ తమఎఐ సాంకేతికతను సామూహిక నిఘాకు లేదా అటానమస్ ఆయుధాలకు ఉపయోగించకూడదని నిబంధన విధించడంతో పెంటాగన్ ఆ సంస్థను పక్కన పెట్టింది. ఆ వెంటనేచాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ రంగంలోకి దిగి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా అమెరికాలో చాట్‌జిపిటి యాప్ తొలగింపులు (అన్‌ఇన్‌స్టాల్) ఒక్కసారిగా 295 శాతం పెరగగా, వన్‌స్టార్ రేటింగ్‌లు 775 శాతం పెరిగాయి. ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి, యుద్ధాల్లో ఉపయోగించడానికి ఓపెన్ ఎఐ అంగీకరించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. రక్షణ ఒప్పందాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్‌కి చెందిన క్లాడ్ యాప్ డౌన్‌లోడ్లు 88 శాతం పెరిగి, అమెరికా యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుంది.ఈ వివాదంపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మాన్ స్పందిస్తూ.. పెంటాగన్ ఒప్పందం జరిగిన తీరు అస్తవ్యస్తంగా ఉందని అంగీకరించారు. ఆంత్రోపిక్‌తో పెంటాగన్‌కు విభేదాలు వచ్చిన వెంటనే ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల యూజర్లకు తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు. తమ ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి లేదా అటానమస్ ఆయుధాల తయారీకి ఉపయోగించకూడదనే నిబంధనలను స్పష్టం చేసినాకే తాము రక్షణ శాఖతో కలిసి పనిచేస్తున్నామని ఆయన వివరించారు.

హాట్ టాపిక్ గా వైసీపీ నేతల ఆస్తులు!



విజయవాడ: గత పదేళ్ల కాలంలో ఎంపీల ఆస్తుల్లో జరిగిన మార్పులపై ఏడీఆర్ సంస్థ చేసిన తాజా అధ్యయనం దేశ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 2014 నుంచి 2024 వరకు వరుసగా మూడు సార్లు గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల వివరాలను ఈ సంస్థ విశ్లేషించింది. ఈ అధ్యయనంలో అత్యంత వేగంగా ఆస్తులు పెరిగిన ఎంపీల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కీలక స్థానాల్లో నిలవడం విశేషంగా మారింది.టాప్ మూడు ఎంపీల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు, ఆ ఇద్దరూ ఒకే రాజకీయ పార్టీ అయిన వైసీపీకి చెందిన వారు కావడం మరింత ఆసక్తికర అంశం. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిథున్ రెడ్డి ఆస్తులు పదేళ్లలో ఏకంగా 550 శాతం పెరిగినట్లు ఏడీఆర్ వెల్లడించింది. 2014లో ఆయన ఆస్తులు సుమారు రూ. 22 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ. 66 కోట్లకు చేరాయి. 2024లో ఇవి రూ. 146 కోట్లకు పెరిగినట్లు అఫిడవిట్‌లో నమోదైంది. ఈ వేగవంతమైన పెరుగుదలతో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎంపీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచారు.ఇక కడప లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ రూ. 7 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ. 18 కోట్లకు చేరింది. 2024 ఎన్నికల సమయంలో ఇవి రూ. 40 కోట్లుగా నమోదయ్యాయి. ఆస్తుల పెరుగుదల పరంగా చూస్తే ఆయన దేశంలో 15వ స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.ఈ ఇద్దరిని మించి టాప్ స్థానంలో నిలిచిన ఎంపీ జార్ఖండ్‌కు చెందిన విజయ్ కుమార్ హన్సదక్ అని అధ్యయనం స్పష్టంచేసింది. జార్ఖండ్ ముక్తి మోర్చాపార్టీకి చెందిన ఈనేత రాజ్ మహల్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లో ఆయన ఆస్తులు కేవలం రూ. 68.63 లక్షలుగా ఉండగా, 2024 నాటికి రూ. 6 కోట్లకు పెరిగాయి. ఇది దాదాపు 804 శాతం పెరుగుదలగా ఏడీఆర్ లెక్కించింది.తెలంగాణకు చెందిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆస్తులు కూడా పదేళ్లలో 488 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడిం చింది. ఈ జాబితాలో ఆయన 24వ స్థానంలో నిలిచారు. ఇక ఏపీ నుంచి టీడీపీతరఫున గెలిచిన ఏకైక ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రిరామ్మోహన్ నాయుడు ఆస్తులు 177 శాతం పెరిగాయి.

ఆస్తులు తగ్గిన అరుదైన ఉదంతంగా కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ పేరు వినిపిస్తోంది. గుజరాత్‌లోని నవ్‌సారి నుంచి హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆయన ఆస్తులు పదేళ్లలో 47 శాతం తగ్గినట్లు తేలింది. 2014లో రూ. 74.47 కోట్లుగా ఉన్న ఆయన ఆస్తులు 2024 నాటికి రూ. 39.49 కోట్లకు తగ్గాయి. మొత్తంగా దేశవ్యాప్తంగా ఎంపీల ఆస్తుల సగటు పెరుగుదల 110 శాతంగా ఉందని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. టాప్ 10లో ఐదుగురు బీజేపీ ఎంపీలు ఉండగా, వైసీపీ రెండో స్థానంలో నిలవడం గమనార్హంగా మారింది.

ముఖంపై ఈ లక్షణాలు కనిపిస్తే ఫ్యాటీ లివర్ ఉన్నట్లే



కాలేయం మొత్తం బరువులో 5 నుంచి 10 శాతం కొవ్వు పెరిగితే దానిని ఫ్యాటీ లివర్ డిసీజ్ అంటారు. ఈ సమస్యని మొదట్లోనే గుర్తించడం చాలా ముఖ్యం. లేదంటే లక్షణాలు పెరిగి లివర్ ఫెయిల్ అయ్యే అవకాశం ఉంది. అయితే, మొదట్లో లక్షణాలు కనిపించవు. సమస్య ఉందో లేదో కొన్నిసార్లు మనం ముఖాన్ని చూసి చెప్పొచ్చు. ఈ లక్షణాలన్నీ మిగతా సమస్య లక్షణాల్లానే ఉంటాయి. అలా అని నిర్లక్ష్యం చేస్తే లివర్ ఫెయిల్ అవకాశం ఉంటుంది. అందుకే, ముందుగానే అలర్ట్ అవ్వండి. ఈ లక్షణాల గురించి న్యూట్రిషనిస్ట్ కృష్ణవేణి క్లియర్‌గా చెబుతున్నారు. ముఖంతో పాటు బాడీలో కనిపించే కొన్ని లక్షణాలను చూసి కూడా సమస్యని ఇట్టే కనిపెట్టొచ్చు. అలాంటి లక్షణాలు ఏంటి, సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చాక తగ్గేందుకు ఏం చేయాలి? ఇలాంటి అన్నీ వివరాలు తెలుసుకోండి. సాధారణంగా ఏదైనా సమస్య ఉంటే ముఖం డల్‌గా కనిపిస్తుంది. స్కిన్ గ్లో తగ్గుతుంది. ఏదో పాలిపోయినట్లుగా రంగు తగ్గినట్లుగా, నీరసంగా ఉంటుంది. ఇలా ఉంటే మనం ముందుగానే అలర్ట్ అవ్వాలి. వీటితో పాటు మన బాడీలో కొన్ని లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్య ఉంటే ముఖం వాపుగా ఉంటుంది. ముఖంలో నీరంతా చేరి వాచినట్లుగా ఉంటుంది. ఇంతకు ముందు లక్షణానికి, దీనికి కాస్తా తేడా ఉన్నప్పటికీ రెండు కూడా ఫ్యాటీ లివర్ ఉందని సూచించే లక్షణాలే. ముఖం ఉన్న రంగు కంటే డిఫరెంట్‌గా కనిపిస్తుంది. పసుపు రంగులో కనిపిస్తుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉంటే ముఖమంతా వాపు,ఉబ్బినట్లుగా ఉండడమే కాకుండా రంగు కూడా మారుతుంది. కళ్ళ చుట్టూ కూడా డార్క్ సర్కిల్స్ వస్తాయి. ముఖమంతా జిడ్డు పేరుకుపోయి యాక్నే లేదా ఎర్రబడడం వంటి లక్షణాలన్నీ కనిపిస్తాయి. దీంతో పాటు దురద, డ్రైగా మారడం, డార్క్ ప్యాచెస్ వంటివన్నీ కనిపిస్తాయి. దీంతో పాటు డబుల్ చిన్ కనిపిస్తుంది. దవడ కింద మరో భాగం వేలాడినట్లుగా ఉంటుంది. మెడ, అండర్ ఆర్మ్ భాగాల్లో నల్లగా మారతాయి. వీటితో పాటు స్పైడర్ వీన్స్ వంటి సమస్యలు వస్తాయి. ఇంతకుముందులా ఉన్నట్లు ముఖం, చర్మ భాగాలు ఉండవు. అన్నింటిలోనూ మార్పులు స్పష్టంగా కనిపిస్తాయి. వీటితో పాటు మిగతా లక్షణాలుబెల్లీ పెరిగిపోతుంది. జీర్ణ సమస్యలు ఎక్కువ అవుతాయి. ఎప్పటికీ నీరసంగా ఉంటారు.

బీట్‌రూట్, దానిమ్మ రసంఆరోగ్యానికి ఏది మంచిది?



నేటి కాలంలో అధిక రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ అనేది చాలా మందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్య. ఇది గుండె జబ్బులు, స్ట్రోక్‌లకు ప్రధాన కారణంగా మారుతోంది. ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు కొన్ని ఆహారాలు, డ్రింక్స్ తీసుకోవడం ద్వారా బీపీని కొంత వరకు నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఇటీవల కాలంలో రక్తపోటు నియంత్రణ కోసం దానిమ్మ రసం, బీట్‌రూట్ రసం అనే రెండు సహజ నివారణలు బాగా ప్రాచుర్యం పొందాయి. దానిమ్మ రసం: దానిమ్మ పండ్లలో పాలీఫెనాల్ యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఆంథోసైనిన్లు, ఎల్లాగిటానిన్లు వంటి యాంటీఆక్సిడెంట్లు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు రక్త నాళాల ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. దానిమ్మ రసం తాగడం వల్ల ధమనుల స్థితిస్థాపకత మెరుగుపడుతుందని అధ్యయనాలు నూచిన్తున్నాయి. ఇది అథెరోస్క్లెరోసిన్ నుండి రక్షణ కల్పిస్తుంది.బీట్‌రూట్ రసం: బీట్‌రూట్‌లో సహజంగా నైట్రేట్లు అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరం యొక్క మొత్తం రక్త ప్రసరణను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. నైట్రేట్లు రక్త నాళాలను విస్తరించడానికి సహాయపడతాయి, తద్వారా రక్త ప్రసరణ సులభం అవుతుంది. బీట్‌రూట్ బీటాలైన్‌లు వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. అదనంగా ఒక కప్పు బీట్‌రూట్ రసం రోజువారీ అవసరాలలో 16 శాతం ఫోలేట్‌ను అందిస్తుంది. ఇది ఎర్ర రక్త కణాల నిర్మాణం, డిఎన్ఎ సంశ్లేషణకు చాలా అవసరం. ఏది బెస్ట్?: రెండు రకాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని పరిశోధనలు చెబుతున్నప్పటికీ అధిక రక్తపోటును తగ్గించడంలో బీట్‌రూట్ రసం ఒక అడుగు ముందు ఉంది. బీట్‌రూట్‌లో ఉండే అధిక నైట్రేట్ కంటెంట్ కారణంగా ఇది రక్త నాళాలను విశ్రాంతి స్థితికి తీసుకువచ్చి, రక్త ప్రసరణను వేగవంతం చేస్తుంది. ఇది రక్తపోటు స్థాయిలను సమర్థవంతంగా, దీర్ఘకాలికంగా నియంత్రించడానికి సహాయపడుతుంది. అధిక బీపీ సమస్య ఉన్నవారు, తమ రక్త ప్రసరణను మెరుగుపరుచుకోవడానికి, బీపీని నియంత్రణలో ఉంచుకోవడానికి బీట్‌రూట్ రసాన్ని తమ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమైన మార్గంగా నిపుణులు సూచిస్తున్నారు.

రొమ్ము క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ఎలా..?



ప్రస్తుతం మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపిస్తున్న క్యాన్సర్‌లలో రొమ్ము క్యాన్సర్ ముందు వరుసలో ఉంది. ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన మహిళల్లో ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.కానీ ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయమవుతుంది. అందుకే రొమ్ములో వచ్చే మార్పులను స్వయంగా పరిశీలించడం, ఏవైనా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

ఇలా చేయడం వల్ల చాలా మంది మహిళలు ఈ వ్యాధి నుంచి కోలుకుంటున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు ప్రధాన లక్షణాలలో ఒకటి రొమ్ములో గడ్డలు లేదా ఏదో భాగం గట్టిగా అనిపించడం. ఇది తరచూ నొప్పి లేకుండా ఉంటుంది, కానీ గుర్తించకపోతే క్రమంగా పెరిగి సమస్యగా మారుతుంది. అలాగే చంకల కింద గడ్డలు కనిపించడం కూడా ముఖ్యమైన సంకేతం. ఇవి లింఫ్ నోడ్స్‌లో క్యాన్సర్ వ్యాప్తి చెందినట్లు సూచిస్తాయి. ఇంకా రొమ్ము చర్మం రంగు మారడం లేదా మసకబారడం, ఆరెంజ్ తొక్కలా మారడం వంటివి కూడా గమనించాలి. ఈ మార్పులు సాధారణంగా కనిపించకపోయినా, వచ్చినప్పుడు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. చను మొన ప్రాంతంలో మార్పులు కూడా రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించినవే.

పరోటా, పన్నీర్ తింటే ఆరోగ్యానికి ముప్పేనా...?



రుచికి ప్రాధాన్యం ఇస్తూ చాలామంది ఇష్టంగా తినే పరోటా ం పన్నీర్ కలయిక ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా షుగర్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈ ఆహారాన్ని తరచూ తీసుకోవడం ప్రమాదకరమని సూచిస్తున్నారు. వైద్యుల వివరాల ప్రకారం, పరోట తయారీలో ఉపయోగించే మైదా, అధిక నూనె శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. గుండెపై భారం పడే అవకాశం ఉంది.

ఈ రెండూ కలిసి తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగడంతో పాటు బరువు కూడా పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రత్యేకంగా పట్టణ ప్రాంతాల్లో ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు పెరుగుతున్న నేపథ్యంలో యువతతో పాటు మధ్య వయస్సు వారిలో కూడా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ సమస్యలు ఎక్కువవుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరోట ం పన్నీర్‌ను రోజూ లేదా తరచూ తీసుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మైదా ఆధారిత ఆహారాల స్థానంలో గోధుమ చపాతీ, జొన్న లేదా రాగి రొట్టెలు తీసుకోవాలని, పన్నీర్‌ను కూడా లో-ఫ్యాట్ రూపంలో పరిమితంగా మాత్రమే వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

సమస్యలు వేధిస్తున్నాయా..

వేపతో చక్కటి పరిష్కారం..!



మన దేశంలోని సాంప్రదాయక వైద్య విధానాల్లో వేపకు చాలా ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా వానాకాలంలో సంక్రమించే చర్మ సంబంధితమైన సమస్యల కు వేపకు మించిన పరిష్కారం లేదని నిపుణులు చెబుతున్నారు. వేప నూనె, వేప ఆకులు, వేప పసరు ఇలా ఎన్నో రకాలుగా వేపను సమస్యల పరిష్కారానికి వినియోగించవచ్చు. వేపలో నింబిడిన్, అజాడిరెక్టిన్, ఫ్లేవనాయిడ్స్ లాంటి బయోయాక్టివ్ రసాయనాలు ఉన్నాయి. వీటి కారణంగా ఫంగల్, బ్యాక్టీరియల్ వ్యాధులతోపాటు ఇన్ఫ్లమేషన్ నుంచి కూడా రక్షణ లభిస్తుంది. వానాకాలంలో గాల్లో తేమ ఎక్కువగా ఉంటుంది. ఫలిత ంగా చర్మ సంబంధిత సమస్యలు మొదలవుతాయి. వీటికి వేప చక్కని పరిష్కారం చూపుతుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు చెమట ఎక్కువగా ఉత్పత్తి అయ్యి చర్మ రంధ్రాలు మలినా లతో పూడుకుపోతాయి. అది చివరకు బ్లాక్ హెడ్స్, పింపుల్స్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. వేపలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల కారణంగా బ్యాక్టీరియా ఇబ్బంది తొలగి చర్మానికి స్వాంతన దొరుకుతుందని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై తెల్లని పొట్టు రేగడాన్ని ఎగ్జీమా అంటారు. ఈ సమస్య ఉన్న వారిని దురద కూడా వేధిస్తుంది. వానా కాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. వేపలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎగ్జీమా నుంచి ఉపశమనం కలిగిస్తాయని హెల్త్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. ఫైటో కాంపౌండ్స్, ఫ్లేవనాయిడ్స్, అజాడిరాడియోన్ కాంపౌండ్స్ ఎగ్జీమా తీవ్రం కాకుండా నిరోధిస్తాయని అంటున్నారు. సోరియాసిస్ ఉన్న వారిలో చర్మంపై పొలుసులతో కూడిన ఎర్రటి ప్యాచెస్ ఏర్పడతాయి. దురద కూడా పెరుగుతుంది. వానాకాలంలో గాల్లోని తేమ కారణంగా సమస్య మరింత తీవ్రమవుతుంది. అయితే వేప పసరు చర్మానికి రాసుకుంటే సోరియాసిస్ నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేప నూనెలో గాయాలను త్వరగా మానేలా చేసే గుణం కూడా ఉందని తెలుపుతున్నారు. అదేవిధంగా వానాకాలంలో అథ్లెట్స్ ఫూట్, రింగ్ వార్మ్, కాండిడియాసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు కూడా ఎక్కువవుతాయి. అయితే వేపలోని యాంటీఫంగల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలకు సులువుగా చెక్ పెడతాయి. ఫంగస్ పెరుగుదలను అడ్డుకుని వ్యాధులను నిరోధిస్తాయి. కాబట్టి ఈ కాలంలో వచ్చే అనేక సమస్యలకు వేప మంచి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు.

మఖానా.. మంచిదేనా?



'ఫూల్ మఖానా'ను చాలామంది హెల్దీ స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లను పొందుతున్నారు. ఆరోగ్యానికి భరోసానిచ్చే ఈ తామర విత్తనాలు.. కొందరికి మాత్రం హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నిరకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు.. 'మఖానా'కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.గర్భిణులు మఖానాను పరిమితంగానే తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకుంటే.. శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. దాంతో అసౌకర్యం ఏర్పడుతుంది. కాబట్టి, వైద్యుడిని సంప్రదించిన తర్వాతే.. మఖానాను తినాలి. కిడ్నీ సమస్యలతో బాధపడేవారికీ.. మఖానా మంచిది కాదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్య ఉన్నప్పుడు.. శరీరంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి, కిడ్నీరోగులు 'మఖానా' ముట్టకుంటేనే బెటర్! మఖానా తింటే కొందరిలో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే ఫైబర్.. కొన్నిసార్లు గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను సృష్టిస్తుంది. అల్సర్, గుండెల్లో మంట, ఇతర జీర్ణ సమస్యలుంటే.. మఖానాను పక్కన పెట్టేయాలి. కొందరిలో 'మఖానా' అలెర్జీలకు దారితీస్తుంది. చర్మంపై దద్దుర్లు, దురద, ఇతర ఇన్‌ఫెక్షన్లు కనిపిస్తాయి. మఖానా తిన్నప్పుడు ఏదైనా అలెర్జీ వచ్చినట్లయితే.. వీటికి దూరంగా ఉండాలి. తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. మఖానాలో కార్బోహైడ్రేట్లు అధిక మొత్తంలో లభిస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

నేరేడు పండ్ల లాభాలు తెలిస్తే వదలరు..



వేసవికాలంలో లభించే పండ్లలో నేరేడు పండు ఒకటి. ఇందులో విటమిన్ సి, ఐరన్, పొటాషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కావున వీటిని తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండింటిలోనూ దీన్ని ప్రయోజనకరంగా పరిగణిస్తారు. డయాబెటిస్ ఉన్నవారికి నేరేడు పండ్లు ఎంతో మేలు చేస్తాయి. దీనిలో ఉండే జామున్, జాముసీన్ వంటి రసాయనాలు రక్తంలోని చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే, ఇందులో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. నేరేడు పండ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని వైరస్, బ్యాక్టీరియా నుంచి రక్షిస్తాయి. అలాగే, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు దీని తినొచ్చు. ఇందులో తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటుంది. కావున దీన్ని తీసుకున్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇది జీవక్రియను వేగవంతం చేసి బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మ ఆరోగ్యానికి కూడా నేరేడు ఉపయోగపడుతుంది. ఇందులోని విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. ఇది కాలేయాన్ని శుభ్రపరచి ఫ్యాటీ లివర్ వంటి సమస్యల నుంచి రక్షిస్తుంది.

షుగర్ ఉన్నా.. ఈ నాలుగు ఫ్రూట్స్ తినొచ్చు!



సాధారణంగా పండ్లు తియ్యగా ఉంటాయి కాబట్టి, అందులో చక్కెర ఉంటుందని, డయాబెటిస్ ఉన్నవారు తినకూడదని అనుకుంటారు. అయితే కొన్ని పండ్లను మధుమేహులు కూడా నిరభ్యంతరంగా తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతూనే, అవసరమైన పోషకాలను అందించే నాలుగు పండ్ల గురించి తెలుసుకుందాం.

ఆహారపు అలవాట్లపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మధుమేహ రోగులు పండ్లకు దూరంగా ఉంటారు. పండ్లలో సహజ సిద్ధమైన చక్కెర ఉంటుందనే భయంతో వాటిని తినడానికి సందేహిస్తారు. కానీ కొన్ని పండ్లు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. అటువంటి పండ్లను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన రీతిలో పోషకాలను పొందవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేసే పండ్లు

యాపిల్స్: వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను నెమ్మదించేలా చేస్తుంది, తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధిస్తుంది. యాపిల్స్ తినడం వల్ల కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన స్నాక్స్ తీసుకోవాలనే కోరిక తగ్గుతుంది.

నారింజ: విటమిన్ సి కి గొప్ప వనరు అయిన నారింజలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా సహాయపడతాయి.

బెర్రీ వండ్లు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా, శరీరంలో ఇన్ ఫ్లమేషన్ ను తగ్గించడంలో కూడా దోహదపడతాయి.

కివి ఫ్రూట్స్: కివిలో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఇది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

అయితే, మధుమేహులు పండ్లను తీసుకునేటప్పుడు వాటి పరిమాణంపై శ్రద్ధ వహించాలి. ఏవైనా సందేహాలుంటే, మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించడం మంచిది. వారు మీ ఆరోగ్య పరిస్థితికి తగిన సలహాలను అందిస్తారు.

పిల్లల్ని కనడానికి.. పెళ్లికి ఏం సంబంధం



గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న నటి నిత్యామీనన్. నటనలో జీవించడమే తప్ప, కృత్రిమమైన హొయలు పోవడం ఆమెకు అస్సలు తెలియదు. అందుకే ఆమె చేసే సినిమాలుఎంత డిఫరెంట్‌గా ఉంటాయో, ఆమె ఇచ్చే స్టేట్‌మెంట్స్ కూడా అంతే పవర్‌ఫుల్‌గా ఉంటాయి. తాజాగా పెళ్లి, పిల్లల విషయంలో నిత్యా చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. సాంప్రదాయాలకు, సామాజిక కట్టుబాట్లకు భిన్నంగా ఆమె వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. చైల్డ్ ఆర్టిస్ట్‌గానే వెండితెరకు పరిచయమై, తెలుగులోకి రాకముందే దాదాపు ఎనిమిది సినిమాల్లో నటించి మెప్పించింది ఈ మలయాళ ముద్దుగుమ్మ. అలామొదలైంది సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, మొదటి చిత్రంతోనే కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టేసింది. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రల కంటే, నటనకు ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్ ఓరియెంటెడ్ రోల్స్‌నే ఎంచుకుంటూ స్లో అండ్ స్టడీగా దూసుకుపోతోంది. ఆమె స్క్రీన్ మీద ఉంటే ఆ కళే వేరు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో నిత్యా మాట్లాడిన మాటలు వింటే.. ఆమె ఎంత బోల్డ్ అండ్ క్లారిటీ ఉన్న పర్సనో అర్థమవుతుంది. సినిమాలు తగ్గిన టైంలో సాధారణంగా హీరోయిన్లకు పెళ్లి ఎప్పుడు అనే ప్రశ్న ఎదురైతే ఏదో ఒక సమాధానం చెప్పి దాటవేస్తుంటారు. కానీ నిత్యా మాత్రం ఈ విషయాన్ని చాలా లోతుగా విశ్లేషించింది. పిల్లల్ని కనడానికి పెళ్లితో సంబంధం లేదని ఆమె అభిప్రాయ పడటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పిల్లలు కావాలనుకోవడం అనేది పూర్తిగా ఒక వ్యక్తిగత నిర్ణయమని, దానికి వివాహం ఒక్కటే మార్గం కాదని ఆమె కుండబద్దలు కొట్టారు.

మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన ప్రముఖ డైరెక్టర్



'పరాశక్తి' సినిమా రెమ్యునరేషన్ విషయంలో మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు దర్శకురాలు సుధా కొంగర. సుధా కొంగర దర్శకత్వంలో డాన్ పిక్చర్స్ నర్మించిన 'పరాశక్తి' సినిమాలో శివకార్తికేయన్ హీరోగా, శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. 2026లో విడుదలై ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసిందని నిర్మాతలు ప్రకటించారు.

కానీ ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపించి తనకు ఇవ్వాల్సిన మిగిలిన రెమ్యునరేషన్ రూ. 8 కోట్లు ఎగ్గొట్టారని మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది దర్శకురాలు సుధా కొంగర. ఆమెకు చెల్లించాల్సిన మొత్తం చెల్లించకుండానే ఇప్పుడు అదే నిర్మాణ సంస్థ 'ఇదయం మురళి' అనే మరో సినిమాను నిర్మించి విడుదల చేయాలని చూస్తుందని సుధ కొంగర తరపు కౌన్సిల్ కోర్టులో వాదించింది. దీంతో సుధా కొంగరకు పూర్తి పారితోషికం చెల్లించేంత వరకు 'ఇదయం మురళి' సినిమా విడుదలను నిలిపివేయాలని కోర్టు సదరు నిర్మాణ సంస్థను ఆదేశించింది. అంతేకాకుండా.. ఈ కేసు తదుపరి విచారణ జరిగే వరకు 'పరాశక్తి' సినిమాను శాటిలైట్‌లో కూడా విడుదల చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది.

'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో తమన్నా..!



సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోళీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా..తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్లక్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.

నా చిరకాల కోరిక నెరవేరుతుంది



యంగ్ హీరోయిన్ ప్రీతి ముకుందన్ చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ భారీ క్రేజ్ రాబట్టుకున్నారు. ఆమె చేసిన రెండు చిత్రాలు బాక్సాఫీసు వద్ద వరుసగా ఫ్లాప్ అయినప్పటికీ అమ్మడు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు.

తనదైన లుక్స్, యాక్టింగ్ స్కిల్స్‌తో తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఇటీవల ఆమె నటించిన 'బ్లాస్ట్' మూవీ సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు, అందులో ప్రీతి చేసిన యాక్షన్ సీన్స్ అందరినీ ఎంతగానో ఆశ్చర్యపరిచాయి.

ప్రస్తుతం అదే జోష్‌లో ఉన్న ఈ భామ, కోలీవుడ్ హీరో అథర్వ మురళి నటిస్తున్న 'ఇదాయం మురళి' సినిమాలో ఒక కీలక పాత్రలో నటించారు. కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది.

అయినా అలాంటి మగాడితో బిడ్డను కంటానంటా!



కోలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి త్వరలో 'గట్ట కుస్తీ-2' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది మామన్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నాను. ఇక ఇప్పుడు సూపర్ హిట్‌గా నిలిచిన 'గట్ట కుస్తీ' సీక్వెల్‌తో సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమయ్యారు. విష్ణు విశాల్ హీరోగా నటించగా.. చెల్లా అయ్యావు తెరకెక్కించారు.

స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాను జూలై 3న మూవీ మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీ బిజీ అయిపోయిన ఐశ్వర్య లక్ష్మి తాజా ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, పెళ్లి గురించి చేసిన కొన్ని షాకింగ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తనకు పెళ్లి బంధంపై ఉన్న భయాలు, అలాగే తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఐశ్వర్య లక్ష్మి మనసు విప్పి మాట్లాడారు.

గతంలో తనకు పెళ్లి బంధంలోకి ప్రవేశించడానికి చాలా భయాలు, సమస్యలు ఉండేవి అని ఆమె చెప్పారు. అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనే సందిగ్ధత ఉండేదని, కానీ ఈ 'గట్ట కుస్తీ-2' సినిమా షూటింగ్ సమయంలో ఒక చిన్నారితో గడిపే అవకాశం వచ్చిందని వెల్లడించారు. ఆ పాపకు దగ్గరైనప్పుడు తనలోని మాతృత్వపు భావాలు ఒక్కసారిగా మేల్కొన్నాయని, ఒక బిడ్డకు జన్మనివ్వాలనే కోరిక తనలో కలిగిందని ఆమె వివరించారు. తనకు కాబోయే భాగస్వామి ఎలా ఉండాలనే దానిపై స్పందిస్తూ.. భవిష్యత్తులో తనకంటూ ఒక బిడ్డను కనాలనుకుంటున్నట్లు ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అయితే, కనీసం తన పిల్లలకు ఒక మంచి తండ్రి అవుతాడని తాను నమ్మే వ్యక్తి, అలాగే ఏ కష్టం వచ్చినా తనను వదిలి పారిపోని ఒక తోడు కావాలని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి దొరికినప్పుడే తాను ఈ బంధాన్ని స్వీకరిస్తానని స్పష్టం చేశారు. పెళ్లి, జీవిత భాగస్వామిపై ఐశ్వర్య లక్ష్మి చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

రియా శింబుకు కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్!



యంగ్ బ్యూటీ రియా శింబు తమిళ, మలయాళ చిత్రాలతో నటిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. 'కప్' మూవీతో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చిన ఆమె 'సర్వం మాయ' సినిమాతో ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఊహించని క్రేజ్ రాబట్టుకున్న రియా ప్రస్తుతం తమిళంలో మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ సరసన చియాన్-63 ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ఆనంద శంకర్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 60 ఏళ్ల విక్రమ్‌తో 21ఏళ్లున్న రియా శింబు రొమాన్స్ చేస్తుండటం విశేషం. చియాన్ విక్రమ్ సినిమాతో పాటు, తాజాగా రియా శింబు కోలీవుడ్‌లో మరో లక్కీ ఆఫర్ దక్కించుకున్నట్లు టాక్ . టాలెంటెడ్ యాక్టర్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న సరికొత్త చిత్రంలో రియా శింబు హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ప్రసిద్ధ దర్శకురాలు కిరుత్తిగ ఉదయనిధి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన షూటింగ్ కూడా శరవేగంగా ప్రారంభం కాగా.. మరో వారం రోజుల పాటు నిర్విరామంగా కొనసాగించి ముఖ్యమైన సీన్స్ పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారట.

మానవ సంబంధాల మధ్య ఉండే సంక్లిష్టమైన భావోద్వేగాలను, పాత్రల మధ్య కెమిస్ట్రీని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంలో దర్శకురాలు కిరుత్తిగ ఉదయనిధికి మంచి పేరుంది. అందువల్ల, విజయ్ సేతుపతి, రియా శింబు కాంబినేషన్‌లో ఆమె నుండి ఒక మంచి ఎమోషనల్ అండ్ ఇంట్రెస్టింగ్ డ్రామా రాబోతున్నట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కోలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ స్టూడియోస్ భారీ నిర్మాణ విలువలతో, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.

పెళ్లిపై శ్రీముఖి షాకింగ్ కామెంట్స్!

శ్రీముఖి.. తెలుగు బుల్లితెరపై తనదైన శైలితో ప్రేక్షకులను అలరిస్తూ ఫుల్ క్రేజ్ సొంతం చేసుకుంది. కెరీర్‌ను చిన్న వయసులోనే ప్రారంభించి, అతి తక్కువ కాలంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే యాంకర్లలో ఒకరిగా ఎదిగింది. తన అద్భుతమైన వాక్చాతుర్యం, గలగలా మాట్లాడే తత్వం.. స్టేజ్ మీద ఆమె చూపించే ఎనర్జీ ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. 'అదుర్స్' వంటి షోలతో ప్రయాణం మొదలుపెట్టినప్పటికీ.. మల్లెమాల ప్రొడక్షన్స్ లో వచ్చిన 'పటాస్' షో ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆమెకు 'రాములమ్మ' అనే పేరు కూడా ఈ షో ద్వారానే పాపులర్ అయింది. దీంతో ఆమెకు వరుసగా టాప్ ఛానల్స్‌లో అవకాశాలు రావడం మొదలైంది. స్టార్ మా, ఈటీవీ, జీ తెలుగు వంటి ప్రముఖ ఛానల్స్‌లో ప్రైమ్ టైమ్ షోలకి ఆమె ఫస్ట్ ఛాయిస్‌గా మారారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'సా రి గ మ ప', 'స్టార్ట్ మ్యూజిక్' వంటి షోల ద్వారా ఆమె తన యాంకరింగ్ రేంజ్‌ను మరింత విస్తరించారు. టెలివిజన్‌తో పాటు వెండితెరపై కూడా తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ షోలో ఆమె చూపించిన పట్టుదల, టాస్క్‌లలో పోరాటం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. బైటిల్ గెలవకపోయినా రన్నరప్‌గా నిలిచి, కోట్లాది అభిమానులను సంపాదించారు. ఈ షో తర్వాత ఆమెకు వచ్చిన క్రేజ్ రెట్టింపు అయ్యి, పెద్ద షోల హోస్టింగ్ అవకాశాలు వరుసగా దక్కాయి. ఇక ఇప్పుడు టెలివిజన్, సినిమాల తర్వాత కొత్తగా వ్యాపార రంగంలోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. కాగా 33 ఏళ్ల వచ్చినప్పటికీ ఇంకా పెళ్లి చేసుకొని ఈ భామ మధ్య మధ్యలో సినిమాల్లో కూడా నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com